నేడు జాతీయ లోక్ అదాలత్

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 22 బెంచ్‌లు ఏర్పాటు

● జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప(రూరల్) జూన్ 28: జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శనివారం ఉదయం 10 గంటలకు ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు డీఎల్‌ఎస్‌ఏ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ వివరాలను శుక్రవారం జడ్జి మీడియాకు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 22 బెంచ్‌లు ఏర్పాటుచేశామన్నారు. కడపలోని జిల్లా కోర్టు ఆవరణలో 6, ప్రొద్దుటూరు కోర్టులో 4, రాయచోటి కోర్టులో 4, బద్వేల్ కోర్టులో 2, రాజంపేట కోర్టులో 1, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లె, మైదుకూరు కోర్టులలో ఒక్కొక్క బెంచ్ చొప్పున ఏర్పాటుచేశామన్నారు. అలాగే రాజంపేటలోని మూడవ అదనపు జిల్లా కోర్టుకు సంబంధించిన కేసులు కడప అదనపు జిల్లా కోర్టు (ఫ్యామిలీకోర్టు) బెంచ్‌లో పరిష్కస్తామన్నారు. రైల్వేకోడూరు కోర్టుకు సంబంధించిన కేసులు కడప ఎక్సైజ్ కోర్టు బెంచ్‌లో, రాజంపేట మెజిస్ట్రేట్ కోర్టుకు సంబంధించిన కేసులు, నందలూరు కోర్టుకు సంబంధించిన కేసులు కడప ఫస్ట్ ఆడిషనల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కోర్టు బెంచ్‌లో పరిష్కరిస్తారన్నారు. సిద్ధవటం కోర్టుకు సంబంధించిన కేసులు బద్వేల్ జుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ కోర్టు బెంచ్‌లో పరిష్కరిస్తారన్నారు. ఈ మార్పును కక్షిదారులు, న్యాయవాదులు, ఆయాశాఖ అధికారులు గమనించాలన్నారు.

అర్హులందరికి రుణాలు

● డీసీసీబీ ఇన్‌చార్జ్ సీఈవో రాజామణి



కడప(రూరల్) జూన్ 28: కడప డీసీసీ బ్యాంకులో అర్హులందరికీ ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు రుణాలు అందజేస్తామని డీసీసీబీ ఇన్‌చార్జ్ సీఈవో రాజామణి తెలిపారు. శుక్రవారం డీసీసీబీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. బ్యాంకు, సహకార సంఘాల నిబంధనల మేరకు రుణం ఇస్తున్నామన్నారు. నిబంధనలు అతిక్రమించి ఎలాంటి రుణాలు మంజూరు చేయడానికి ఆస్కారం లేదన్నారు. ఇచ్చిన రుణాలను సకాలంలో వసూలు చేస్తున్నామన్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి ఇచ్చిన రుణాలలో 95 శాతం రికవరీ ఉందన్నారు. పులివెందులలో హార్టికల్చర్ సాగు ఎక్కువగా ఉండడం వలన ఆ ప్రాంతంలో రైతులకు డీసీసీబీ బ్యాంకు కేవలం రూ.2 లక్షలకు మించకుండా రుణాలు ఇచ్చిందన్నారు. అలాగే ప్రొద్దుటూరు, రాయచోటి ప్రాంతంలో కూడా రైతులు, వినియోగదారుల అవసరాలకు ఇళ్లు, భూమి, స్థలం తనఖా పెట్టుకొని అప్పులు ఇచ్చామన్నారు. నాబార్డు నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి గరిష్టంగా రూ.40 లక్షల వరకు రుణం ఇచ్చేందుకు అనుమతి ఉందన్నారు. రుణాల రికవరీ బాగా ఉన్నందువలన ఉమ్మడి కడప జిల్లా లో 4 కొత్త బ్రాంచీలను, మొబైల్ బ్యాంకింగ్ సర్వీసును రిజర్వుబ్యాంకు మంజూరుచేసిందన్నారు. ఈ మేరకు 2021-22లో దేశంలోనే ఉత్తమ బ్యాంకుగా కడప డీసీసీబీకి అవార్డు లభించిందన్నారు. గత మూడు సంవత్సరాల క్రితం బ్యాంకు డిపాజిట్లు రూ.300 కోట్లు ఉండగా ప్రస్తుతం రూ.513 కోట్లుకు పెరిగిందన్నారు. తాము ఎలాంటి రాజకీయ వత్తిళ్లు లేకుండా అడిగిన వారికి అర్హత మేరకు సకాలంలో రుణాలు మంజూరు చేసి అందరి మన్ననలను పొందుతున్నామన్నారు. ఈ సమావేశంలో డీజీఎం కె.వెంకటేశర్లు, వై.ప్రతాప్‌రెడ్డి, ఏజీఎంలు రాజేంద్రకుమార్‌రెడ్డి, జి.వీరబ్రహ్మం, టీవీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న కౌలురైతు గడ్డల రాజ

వేంపల్లె, జూన్ 28: వేంపల్లె పట్టణం పులివెందుల రోడ్డులోని ఐటీఐ సమీప పరిసరాల్లో అప్పులబాధతో కౌలురైతు గడ్డల రాజ (44) ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య స్నేహిత వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. చక్రాయపేట మండలానికి చెందిన రైతు గడ్డల రాజ, భార్య స్నేహిత, కుమార్తె హర్షిత, కుమారుడు సూపర్ ఉన్నారు. రాజా తల్లికి ఉన్న రెండు ఎకరాల పొలం, మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని ప్రొద్దుతిరుగుడు, వేరుశనగ సాగు చేసేవారు. ప్రస్తుతం వరిపంట సాగుచేస్తున్నారు. పంటల సాగు కోసం సుమారు రూ.7లక్షల దాకా అప్పులు తెచ్చాడు. పంటల దిగుబడి రాకపోవడంతో నష్టాలపాలయ్యాడు. అప్పుల బాధతో శుక్రవారం వేంపల్లెకు వచ్చిన రాజ ఐటీఐ సమీపంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. స్థానికులు గుర్తించి వేంపల్లె ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు మృతుడి భార్య స్నేహిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యా దు చేశారు. కాగా.. టీడీపీ మైనార్టీ సెల్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, మండల కన్వీనర్ మునిరెడ్డి, చక్రాయపేట టీడీపీనాయకులు ఎద్దుల చంద్ర, అశోక్‌లు మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సాంకేతిక విద్య.. మిథ్య

డిజిటల్ ఇండియాలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో గత ప్రభుత్వపాలనలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన వర్చువల్ విద్యాబోధన ఐదేళ్లుగా కుంటుపడింది. దీంతో కోట్ల విలువ చేసే ల్యాప్‌టాప్, వెబ్‌క్యామ్, బ్యాటరీలు, కంప్యూటరు, స్క్రీన్ తదితర వస్తువులు నిరుపయోగంగా మారాయి. కొన్ని పాఠశాలల్లో హెచ్‌ఎంలు తమ సొంత పనులకు వాటిని వినియోగించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో చోరీకి గురైనట్లు సమాచారం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలనే లక్ష్యంగా నాటి టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి కడప జిల్లాలో ఏర్పాటు చేసిన వర్చువల్ స్టూడియోను వైసీపీ జగన్ ప్రభుత్వం మూలనపడేసింది. ఫలితంగా స్టూడియో కోసం వెచ్చించిన రూ.35 నుంచి రూ.40లక్షలు వృధాగా మారాయి.





● జిల్లాలో నిరుపయోగంగా కోట్ల రూపాయల సామగ్రి

● రూ.40 లక్షలతో ఏర్పాటు చేసిన స్టూడియో నిరుపయోగం

● ప్రభుత్వం చొరవ చూపితే మళ్లీ విద్యార్థులకు మెరుగైన విద్య

కడప (ఎడ్యుకేషన్), జూన్ 28 : టీడీపీ ప్రభుత్వంలో వర్చువల్ తరగతుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. విద్యార్థులకు ఆధునిక పద్ధతులతో విద్యాబోధన అందించాలని సంబంధిత పాఠ్యాంశ విషయ నిపుణుల

సాంకేతిక పరిజ్ఞానంతో బోధన

గ్రామాల్లోని పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సైతం ద్వారా బోధన జరిగితే విద్యార్థులకు ఎంతో వెసులుబాటు ఉంటుందని భావించి ట్రైజన్ టెక్నాలజీ (ఏపీఎస్ఎఫ్) ఏపీ ఫైబర్ నెట్ ఆధ్వర్యంలో స్టూడియోలు ఏర్పాటు చేశారు. 2018లో ఉమ్మడి కడప జిల్లాలో మొత్తం 378 పాఠశాలల్లో ఒక్కోపాఠశాలకు రూ.4.50లక్షలు వ్యయం చేసి ఈ కార్యక్రమం ప్రారంభించారు. రాష్ట్రంలోని స్టూడియోల్లో అన్నిపాఠ్యాంశ నిపుణులతో లైవ్ తరగతులు కొనసాగాయి. విద్యార్థులను ఈ బోధన ఆకట్టుకుంది. విద్యార్థులు తమ సందేహాలు నివృత్తి చేసుకునేందుకు అవకాశం ఉండేది. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు వస్తాయని ఆశించారు. తరువాత ఎన్నికలు రావడం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ విధానంపై నిర్లక్ష్యం వహించింది. జగన్ ప్రభుత్వం తీసుకున్న రివర్స్ చర్యల కారణంగా ఆ వర్చువల్ స్టూడియోలు ఐదేళ్లుగా మూతపడ్డాయి. మరో వైపు పాఠశాలలకు కేటాయించిన నిధులను ప్రభుత్వం దారి మళ్లించి అన్యాక్రాంతం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో..

వర్చువల్ తరగతుల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం మెరుగైన బోధన అందించడమే లక్ష్యంగా వర్చువల్ పద్ధతుల్లో బోధనకు నాటి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ఏపీ ఫైబర్ లిమిటెడ్ ఒక్కో పాఠశాలకు రూ.4.50 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో డిజటల్ స్క్రీన్, కంప్యూటరు, ఆడియో వీడియో కెమెరాలు, పోడియం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పాఠశాలల్లో ఇవి ఉన్నాయో లేవో కూడా ఉపాధ్యాయులు చెప్పలేకపోతున్నారు. జిల్లా స్థాయిలో ఒక స్టూడియోలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు సబ్జెక్టు పాఠాలు బోధిస్తుంటే వర్చువల్ తరగతులు ఉన్న పాఠశాలల్లో ప్రత్యక్షంగా చూసి నేర్చుకునే అవకాశం ఉంది. కడప నగరంలో మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో రూ.35 నుంచి రూ.40 లక్షల వ్యయంతో స్టూడియో నిర్మాణం చేపట్టారు. సెంట్రల్ ఏసీతో స్టూడియో ఏర్పాటు చేశారు. అలాగే రూ.13 లక్షలతో ప్రొటెక్షన్‌వాల్, సమావేశ మందిరం కూడా నిర్మించారు. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇవన్నీ ఇవన్నీ నిరుపయోగంగా మారాయి.

అప్పట్లో జిల్లాకు ఒక కోఆర్డినేటరును నియమించింది. ఆయనే నేరుగా ప్రత్యేక యాప్ ద్వారా పాఠశాలల్లో వర్చువల్ తరగతులు అమలయ్యే తీరును పర్యవేక్షించేవారు. ఎప్పటికప్పుడు ఈ సమాచారం విజయవాడలోని సెంట్రల్ స్టూడియోకు అందించేవారు. ఉమ్మడి జిల్లాలోని స్టూడియోతో విజయవాడలో గల సెంట్రల్ స్టూడియో అనుసంధానమై ఉంటుంది. ప్రతిజిల్లాలో నిష్ణాతులైన ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారికి వర్చువల్ తరగతులు బోధించడానికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రాజెక్టు మొత్తం నిర్వీర్యమైందని చెప్పాలి.

ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తే

వర్చువల్ విద్యాబోధనపై కొత్తగా కొలువుదీరిన టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని మరలా అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. విద్యార్థులకు మంచి విద్య అందించాలనే లక్ష్యంతో వర్చువల్ తరగతులను ప్రవేశపెట్టిన చంద్రబాబునాయుడు మళ్లీ సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. అలాగే ఈ వర్చువల్ తరగతులు కూడా మరలా ప్రారంభిస్తే విద్యార్థులకు చాలా మేలు జరుగుతుందని చెప్పాలి. ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేయాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లకు 53,863 దరఖాస్తులు

నూజివీడు టౌన్, జూన్ 28: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ విద్యలో ప్రవేశాలకు అధికభాగం బాలికల నుంచి దరఖాస్తులు అందాయని, ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు ఆర్కేవ్యాలీ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో ఉన్న 4,400 సీట్లకు మొత్తం 53,863మంది విద్యార్థులు దరఖాస్తు చేశారన్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల నుంచి 34,154 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 19,671 మంది, ఇతర రాష్ట్రాల నుంచి 38 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 30,857 మంది బాలికలు ఉండగా, 23,006 మంది బాలురు ఉన్నారన్నారు. ఇక సైనిక సంతతి విభా గంలో 2,582 మంది, ఎన్‌సీసీలో 1830, స్పోర్ట్స్ విభాగంలో 1162, దివ్యాంగుల విభాగంలో 332, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 270 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

ఒకటి నుంచి అడ్మిషన్ల ప్రక్రియ

జూలై 1వ తేదీ నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. సైనిక సంతతికి చెందిన విద్యార్థులకు జూలై 1 నుంచి 3వ తేదీ వరకు ఎన్‌సీసీ విద్యార్థులకు జూలై 3 నుంచి 5వ తేదీ వరకు, దివ్యాంగులకు, స్పోర్ట్స్ విభాగంలోని వారికి జూలై 3వ తేదీ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వారికి జూలై 2,3 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. క్యాంపస్‌ల వారీగా ఎంపికైన విద్యార్థుల తుదిజాబితా జూలై 11న విడుదల చేస్తారని, నూజివీడు, ఆర్కే వ్యాలీలలో ఆయా క్యాంపస్‌లకు కేటాయించిన విద్యార్థులకు జూలై 22, 23 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం జరుగుతుందని, ఒంగోలు క్యాంపస్‌కు సంబంధించి జూలై 24, 25 తేదీల్లో, శ్రీకాకుళం క్యాంపస్‌కు సంబంధించి 26,27 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం జరుగుతుందన్నారు.

ప్రత్యేక కేటగిరిల్లో పోటాపోటీ

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో 2024 అడ్మిషన్‌లలో తీవ్ర పోటీ నెలకొంది. ఈసారి సాధారణ కేటగిరిలోనే కాక ప్రత్యేక కేటగిరిల్లో సైతం అడ్మిషన్లకు పోటీ నెలకొనడం విశేషం. క్రీడల విభాగంలో 0.5శాతం రిజర్వేషన్ క్రింద మొత్తం నాలుగు క్యాంపస్‌ల మీద 20 సీట్లను కేటాయించగా, 1162 మంది దరఖాస్తు చేశారు. అంటే ఒక్కో సీటుకు దాదాపు 58 మంది పోటీ పడుతున్నారు. ఇక సైనిక సంతతి విభాగంలో 40 సీట్లకు 2,587 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా, ఇక్కడ ఒక్కో సీటుకు 64 మంది పోటీ పడుతున్నారు. ఎన్‌సీసీ విభాగంలో 80 సీట్లకు 1,830 మంది దరఖాస్తు చేయగా ఒక్కో సీటుకు 22.8 మంది, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 20 సీట్లకు 270 మంది దరఖాస్తు చేయగా ఒక్కో సీటుకు 14 మంది పోటీ పడుతున్నారు. ఒక ప్రత్యేక అవసరాలు కలిగిన విభాగంలో మాత్రం 200 సీట్లకు 332 మంది దరఖాస్తు చేయగా, ఒక్కో సీటుకు 1.66 మంది విద్యార్థులకు పోటీ ఏర్పడింది. మొత్తం మీద స్పెషల్ కేటగిరీలో ఒక ప్రత్యేక అవసరాలు కలిగిన విభాగం మినహా మిగిలిన అన్ని విభాగాల్లోనూ ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌లో ప్రవేశానికి తీవ్ర పోటీ నెలకొంది.

హక్కుల కోసం పోరాడితే అక్రమ కేసులా?

● గత ప్రభుత్వం సూర్యనారాయణపై పెట్టిన కేసులన్నీ ఎత్తివేయాలి

● ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘం నేతల డిమాండ్



సూర్యనారాయణపై కేసులు ఎత్తివేయాలంటూ ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘం ర్యాలీ

కడప(కలెక్టరేట్), జూన్ 28: ఉద్యోగుల సంక్షేమం, ఆర్థిక ప్రయోజనాల కోసం వైసీపీ ప్రభుత్వాన్ని ఉద్యోగుల పక్షాన రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ రావు ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించి వేధించారని, ఆయనపై పెట్టిన కేసులన్నీ ఎత్తివేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రమేశ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని ఆ సంఘం కార్యాలయం నుంచి ఉద్యోగులు కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ విజయరామరాజును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ఐఏఎస్‌ల నుంచి సబార్డినేటర్స్ వరకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను వైసీపీ ప్రభుత్వం వాడుకొని ఉద్యోగులను మానసికంగా వేధించారన్నారు. పని భారం పెంచడమే కాకుండా ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆత్మాభిమానం దెబ్బతినేలా వ్యాఖ్యలు చేశారన్నారు. ప్రశ్నించిన ఉద్యోగులపై కేసులు నమోదు చేశారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగులను, వారి కుటుంబాలను ఆదుకోవడానికి ముందుకు వచ్చి సూర్యనారాయణ నిలదీశారన్నారు. దీంతో ఆయనను శారీరకంగా, మానససికంగా, కుటుంబ పరంగా వేదనకు గురిచేసేలా వైసీపీ పెద్దల సూచన మేరకు అక్రమ కేసులు బనాయించి వేధించారన్నారు. గత ప్రభుత్వంలో తమ పరిధిని దాటి అక్రమ కేసులు బనాయించిన అధికారులను వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే ఐక్య వేదిక నాయకత్వంపై ఉన్న కేసులన్నీ ఉపసంహరించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగసంఘ రాష్ట్ర కార్యదర్శి రఘురామనాయుడు, జిల్లా కార్యదర్శి సుదర్శన రెడ్డి, కడప నగర అధ్యక్షుడు కృష్ణ ప్రసాద్, ప్రభాకర్ రావు, ఓబులేశు, రాశేఖర్, మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భూములిస్తామని బొక్కేశారు

ప్రభుత్వ భూములు, స్థలాలు అప్పనంగా అప్పగిస్తామంటూ ఆ వీఆర్వోలు ఆశచూపి ఆశావహుల నుంచి రూ.కోట్లు వసూలు చేశారు..? ఈ తతంగం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా నడుస్తున్న తరుణంలో వైసీపీ ప్రభుత్వం దిగిపోయి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారి అడ్డదారులు ఒక్కోటి వెలుగులోకి వస్తున్నాయి. సదరు వీర్వోలపై బాధితుల తిరుగుబాటు మొదలైంది. దీంతో గట్టిగా అడిగిన బాధితులకు ఓ వీఆర్వో వసూల్ చేసిన మొత్తంలో రూ.20 లక్షల వరకు తిరిగి చెల్లించారు..? ఈయనే కాక మరికొందరు వీఆర్వోలు కూడా ప్రభుత్వ స్థలాలను ఎరగా వేసి లక్షలకు లక్షలు దండుకున్నారు...? ఇలాంటి స్థలాలపై టీడీపీ ప్రభుత్వం నిఘాపెట్టడంతో వీరి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ తతంగమంతా కడప నగరంలో కలిసిపోయి ఉన్న చింతకొమ్మదిన్నె రెవెన్యూ కార్యాలయ పరిధిలో అడ్డు అదుపు లేకుండా జరుగుతోంది.





ఇందిరానగర్‌లోని ఫారెస్ట్ బఫర్‌ల్యాండ్‌లో ప్రభుత్వ అనుమతులు లేకుండా కట్టిన నిర్మాణాలు

● ప్రభుత్వ భూములు కట్టబెడతామంటూ రూ.కోట్లు వసూళ్లు..?

● వైసీపీ నేతల అండతో ఇష్టారాజ్యం

● ప్రభుత్వం మారడంతో అవినీతి దారులు బంద్

● లబోదిబోమంటున్న బాధితులు

● ఆ వీఆర్వోల అవినీతి బాగోతంపై విచారణ చేపట్టాలని డిమాండ్

కడప(రూరల్), జూన్ 28: వైసీపీ ప్రభుత్వ పాలనలో కొందరు నేతలు తమకు పనులు ఇష్టంవచ్చినట్లు చేసి పెట్టే అధికారులను వీఆర్వోలుగా తెప్పించుకున్నారు. వీరు వచ్చినప్పటి నుంచి అనుకున్న పనులు చకచకా కానించి అందరూ కలిసి కోట్లు గడించారు. రెవెన్యూ నిబంధనలు, రికార్డులతో సంబంధం లేకుండా ప్రభుత్వ స్థలాలను ఆశావహులకు కట్టబెట్టి వారిని నడిసంద్రంలోకి నెట్టారు. ప్రభుత్వ స్థలాలతో చదరంగం ఆడిన సదరు వీఆర్వోల అవినీతి బాగోతంపై ఉన్నతస్థాయి అధికారులతో విచారణ జరిపించి తిన్నది కక్కించడంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

ఆరునెలల క్రితం వచ్చి..

చింతకొమ్మదిన్నె మండలం ఇప్పెంట గ్రామ రెవెన్యూ అధికారి రూటే సపరేటుగా కొందరు బాధితులు చెప్పుకొంటున్నారు. ఈయన ఆరు నెలల క్రితం ఇక్కడికి ఓ వైసీపీ నేత పలుకుబడితో వీఆర్వోగా వచ్చారు. పైగా అప్పటి తహశీల్దార్ ఈయనకు సొంత గ్రామస్తుడు కావడంతో మరింతగా కలిసొచ్చింది. వెరసి ప్రభుత్వ భూములను కట్టబెడతామంటూ ఆశావహుల నుంచి రూ.70 లక్షల వరకు దండుకున్నట్లు సమాచారం. ఈ తతంగం మరింత జోరుగా సాగుతున్న తరుణంలో వైసీపీ ప్రభుత్వం దిగిపోయి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయన పాచికలు పారలేదు. ఇక ఆయన వలన పనులు కావని భావించిన ఆశావహులు వత్తిడి తేవడంతో కొందరికి రూ.20లక్షల వరకు తిరిగి చెల్లించినట్లు సమాచారం. మిగిలిన బాధితులు కూడా తమ భార్యబిడ్డలతో వచ్చి రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన చేపడతామని హెచ్చరిస్తుండడంతో వీఆర్వో ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లు వినికిడి.

అప్పనంగా ప్రభుత్వ స్థలాలు అప్పగింత

మామిళ్లపల్లె వీఆర్వోగా ఒకరు మూడు సంవత్సరాల నుంచి కొనసాగుతున్నారు. ఈయన ఇదివరకు ఇక్కడ పనిచేసి వెళ్లి మళ్లీ ఇక్కడికే వచ్చారంటే ఆయన ప్రత్యేకత ఏంటో అర్థమవుతోంది. వైసీపీ నేతలు ఈయనను వెతుకులాడి ఇక్కడికి వేయించుకున్నట్లు ప్రజలు చెప్పుకొంటున్నారు. సదరు రెవెన్యూ పొలం కడప కార్పొరేషన్‌లో విలీనం కావడంతో ఇక్కడి ప్రభుత్వ స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఎక్కడ ఏ మూలకెళ్లినా సెంటు స్థలం రూ.5 లక్షలు పలుకుతోంది. ఇంతటి డిమాండ్ ఉన్న ప్రభుత్వ స్థలాలను నిబంధనలు, రెవెన్యూ రికార్డులతో సంబంధం లేకుండా ఆశావహులకు కట్టబెట్టి లక్షలను వైసీపీ నేతలు, అధికారులు దండుకున్నట్లు సమాచారం. ఇందిరానగర్ లేఔట్‌లోని ఖాళీ స్థలాలతో పాటు కోట్ల విలువ చేసే రెండు ఎకరాల ఫారెస్ట్ బఫర్ ల్యాండ్, అంగన్వాడీ టీచర్లకు ఇచ్చిన లేఔట్‌లోని ఖాళీ స్థలాలు, జగనన్న కాలనీలోని ఖాళీ స్థలాలు, ఇతర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలను ఆశావహులకు ఎరచూపి వారి వద్ద నుంచి లక్షలకు లక్షలు ఇక్కడి వైసీపీ నేతలు, నాయకులు, రెవెన్యూ అధికారులు వసూలు చేశారని సమాచారం. అయితే ఆ స్థలాపై ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం నిఘాపెట్టడంతో సదరు అధికారులు, నాయకుల లోగుట్టు బట్టబయలు కానుంది. లక్షలు చెల్లించిన బాధితులు తమ పరిస్థితి ఏంటంటూ అధికారులు, నాయకుల చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం.

వైసీపీ నేతలతో అంటకాగి..

ఊటుకూరు రెవెన్యూ పొలం ప్రస్తుత వీఆర్వో కూడా పక్కనే ఉన్న మామిళ్లపల్లె వీఆర్వోగా రెండు పర్యాయాలు పనిచేశారు. తర్వాత ఊటుకూరు రెవెన్యూకు వీఆర్వోగా వచ్చారు. ఈయన వైసీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు సదరు నేతలతో అంటకాగి అనుకున్న పనులు చేసిపెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ విలువైన స్థలాలను ఓ బడానేత కనుసన్నల్లో కట్టబెట్టినట్లు సమాచారం. ఇతరుల చేతుల్లో ఉన్న మరికొన్ని ప్రభుత్వ స్థలాల లోగుట్టును బడానేతకు తెలియపరిచి వారి వద్ద నుంచి నయానో భయానో పెద్ద ఎత్తున రాబట్టినట్లు ప్రచారం జరుగుతోంది.

అవినీతి బాగోతంపై విచారణకు డిమాండ్

ఇప్పెంట, మామిళ్లపల్లె, ఊటుకూరు రెవెన్యూ గ్రామాల పరిధిలో జరిగిన అవినీతిపై ఉన్నత స్థాయి అధికారులతో విచారణ జరిపించి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. మామిళ్లపల్లె, ఊటుకూరు వీఆర్వోలు ఏళ్ల తరబడి కార్పొరేషన్ పరిధిలోనే పనిచేయడంతో వైసీపీ నేతలతో అంటకాగి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేశారని బాధితులు వాపోతున్నారు.

బాధితులు ఫిర్యాదు చేస్తే చర్యలు

● తహశీల్దార్

ఇప్పెంట వీఆర్వో ప్రభుత్వ భూములు కట్టబెడతానంటూ డబ్బులు వసూలు చేసినట్లు తమకు బాధితులు ఎవరూ ఫిర్యాదు చేయలేదని చింతకొమ్మదిన్నె తహశీల్దార్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఒకవేళ బాధితులు ఫిర్యాదుచేస్తే విచారణ జరిపించి తప్పుచేసినట్లు రుజువైతే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించాలి

● 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం సెక్రటరీ రమణారెడ్డి

కడప(రూరల్), జూన్ 28: స్థానిక సంస్థల అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామపంచాయతీల ఆదాయ వనరులను గణనీయంగా పెంపొందించి పల్లె సీమల ప్రగతికి బాటలు వేయాలని 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం సెక్రటరీ రమణారెడ్డి, జడ్పీ సీఈవో మన్నూరు సుధాకర్‌రెడ్డి, డీపీవో ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో శుక్రవారం 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం ప్రతినిధుల బృందం పంచాయతీరాజ్ సంస్థల అధికారులు, ప్రజాప్రతినిధులతో 'గ్రామ పంచాయతీ నిదులు - ఖర్చు - ఆదాయ వనరుల పెంపు' అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లెసీమలు అభివృద్ధి చెందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. పంచాయతీరాజ్ చట్టంపై దృష్టిసారిస్తే అభివృద్ధికి అవసరమైన వనరులను సొంతంగా సమకూర్చుకోవచ్చన్నారు. గ్రామ పంచాయతీలకు ఉన్న ఆదాయ మార్గాలపై మనసు పెట్టాలన్నారు. ప్రభుత్వం నుంచి తలసరి గ్రాంట్, సీనరేజి గ్రాంట్, స్టేట్ ఫైనాన్స్ గ్రాంట్, 15వ ఆర్థిక సంఘం నిధులు, సర్‌చార్జి ఆన్ స్టాంప్ డ్యూటీ (భూముల అమ్మకం, కొనుగోలు వలన ఎస్పీవోలో జమ అయ్యే డబ్బులు) ఇతరత్రా వాటి ద్వారా నిధులు వస్తుంటాయన్నారు. ఇవే కాకుండా పన్నుల ద్వారా కూడా ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. గ్రామపంచాయతీలకు వచ్చే అదాయానికి అనుగుణంగా ఖర్చులు ఎలా ఉన్నాయి? ఏవిధంగా ఆదాయ వనరులను సమకూర్చాలి? ఏమి చేస్తే గ్రామ పంచాయతీలు అభివృద్ధి వైపు నడుస్తాయి? అన్న అంశాలపై 5వ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ మెంబర్లు ప్రసాద్‌రావు, పద్మారావు, కృపారావు తదితరులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీశాఖ పరిపాలనాధికారి ఖాదర్‌బాషా, డీఎల్‌పీవోలు, ఈవోపీఆర్డీలు, ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న 5వ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సెక్రటరీ రమణారెడ్డి తదితరులు

ఆక్రమణలను తొలగిస్తాం: ఎమ్మెల్యే

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 28 : కడప కార్పొరేషన్ పరిధిలో పలువురు కార్పొరేటర్లు రోడ్లను ఆక్రమించి పర్మినెంటు నిర్మాణాలు చేయడం దుర్మార్గమని, అలాంటి వాటిని తొలగిస్తామని ఎమ్మెల్యే మాధవీరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరం 34వ డివిజనులో ఆమె పర్యటించారు. 34వ డివిజను కార్పొరేటరు అక్బర్ రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీ కాల్వపై పర్మినెంటు నిర్మాణాలు చేయడం, అలాగే ఎంపీ నిధులతో ఆర్వో ప్లాంటు కూడా నిర్మాణాలు చేయడాన్ని ఆమె పరిశీలించారు. దీనిపై ఆమె స్పందిస్తూ కార్పొరేటర్లుగా ఉంటూ వైసీపీ నాయకులు రోడ్లను ఆక్రమించడం దుర్మార్గమన్నారు. వీరికి రోడ్లను ఆక్రమించే హక్కు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. ప్రజల ఆస్తులను దోచుకునేందుకే వైసీపీ వారు పదవులు చేపడుతున్నారన్నారు. పేదవారు ఇళ్లు చిన్న చిన్న గుడిసెలు కట్టుకుంటే అది దురాక్రమణ అని, ఈ కార్పొరేటర్లే కూలుస్తుంటారని, అయితే వారికి అవి వర్తించకపోవడం సమంజసం కాదని, త్వరలో వీటిని తొలగించాలని, లేదంటే తామే తొలగించేందుకు చర్యలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం అమీన్‌పీర్ దర్గా ప్రాంతాన్ని పరిశీలించారు. డ్రైన్లు సరి గా లేకపోవడంతో ఆ ప్రాంతాన్ని డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు.అయితే డ్రైనేజీలో చెత్త చెదారం వేయడంతో ఆమె స్థానిక ప్రజలతో మాట్లాడుతూ చెత్తచెదారాన్ని కాల్వల్లో వేయకుండా చెత్త వాహనాలు ఇవ్వాలని సూచించారు. మన కడప నగరం సుందరంగా తీర్చిదిద్దుకోవాలంటే మనం మన చెత్తను డ్రైనేజీ కాలవల్లో వేయకూడదని తెలిపారు.

ఎమ్మెల్యే మాధవీరెడ్డిని కలిసిన లయన్ ఖాసింఖాన్



ఖాసింఖాన్‌ను అభినందిస్తున్న శ్రీనివాసరెడ్డి..చిత్రంలో ఎమ్మెల్యే

కడప(ఎర్రముక్కపల్లె), జూన్ 28: కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిని లయన్ పి.ఖాసింఖాన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కడప ఎమ్మెల్యేగా మాధవీరెడ్డి గెలుపొందిన సందర్భంగా ఖాసింఖాన్ మాధవీరెడ్డితో పాటు ఆమె కుటుంబ సభ్యులను తన నివాసానికి ఆహ్వానించారు. అనంతరం వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప చరిత్రలో మొట్టమొదటి మహిళా శాసనసభ్యురాలు కావడం ఎనలేని ఖ్యాతి సంపాదించి పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఖాసింఖాన్ కుటుంబ సభ్యులు మన్సూర్ అలీఖాన్, తన్వీర్ అలీఖాన్ పాల్గొన్నారు.

భూసార పరీక్షతో అధిక దిగుబడి

వేంపల్లె,జూన్ 28: పంట పొలాలను భూసారపరీక్షలు చేయిస్తే అవసరమైన పోషకాలను అందించవచ్చని, అధిక దిగుబడులు సాధించవచ్చని పులివెందుల వ్యవసాయ శాఖ సహాయ సచాలకులు ఏవీ నరసింహారెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్‌తో కలిసి తాళ్లపల్లె రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శుభాకాంక్షలు

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 28 : కడప ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసి కడపకు విచ్చేసిన మాధవీని కడప వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ రమాదేవి శుక్రవారం ఎ మ్మెల్యే ఇంటిలో కలిసి ఆమెను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవీరెడ్డి రిమ్స్ వైద్య సదుపాయాల గురించి వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమెకు రిమ్స్ అధికారులు అక్కడ పరిస్థితి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన క్రైస్తవ సంఘాల పాస్టర్లు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 28: కడప నగరం ఎమ్మెల్యే మాధవి నివాసంలో శుక్రవారం ఇండిపెండెంట్ పాస్టర్లు ఎమ్మెల్యే మాదవీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాస్టర్ల సమస్యలను ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా పాస్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ మల్లెం విజయభాస్కర్ మాట్లాడుతూ పాస్టర్ల సమస్యలను పరిష్కరించాలని వివరించారు. నారా లోకేశ్ పాదయాత్రలో కడపకు వచ్చినప్పుడు కొంతమంది పాస్టర్లు కలిసి సమస్యలపై 28 అంశాలతో కూడిన వినతిపత్రం అందించామన్నారు. లోకేశ్ కూడా హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల ముందు క్రైస్తవులు, పాస్టర్లకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జయరాజ్, మహేశ్, ఇజ్రాయెల్ పాల్గొని ప్రార్థనలు చేశారు.

'బడికి పోతా'పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఎస్ఎంఓ రామాంజులరెడ్డి

చెన్నూరు, జూన్ 28 :'బడికి పోతా' అనే కార్యక్రమంపై ఉపాధ్యాయులు అవ గాహ న పెరగాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రామాంజులరెడ్డి అన్నారు. శుక్రవారం చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యాప్రవే శం, నేను బడికి పోతా కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాల రాబోవు కాలంలో మ రింత బలోపేతమై వి ద్యార్థుల సంఖ్య పెరగాలన్నారు. అనంతరం ఎంఈఓ గంగిరెడ్డి, ఎంఈఓ-2 సునీతలు దీక్ష యాప్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంటు కమ్యూనిటీ మొబైల్ ఆఫీసరు దశరథరామిరెడ్డి, ఏఎల్ఎస్‌సీఓ విశ్వనాథరెడ్డి, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

న్యాక్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

పులివెందుల టౌన్, జూన్ 28: న్యాక్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా పులివెందులలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కార్యక్రమ ద్వారా ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఉచిత మూడు నెలల ఉచిత నైపుణ్య శిక్షణా కార్యక్రమానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు న్యాక్ ఏడీ రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసిస్టెంట్ సర్వేయర్, ఎలక్ట్రీషియన్, జూనియర్ ఎక్సకవేటర్ ఆపరేటర్, టైలరింగ్, ఎలక్ట్రికల్ వెహికల్ మెయింటెనెన్స్ కోర్సులు ఉంటాయన్నారు. 10వ తరగతి ఆపైన చదివి 18 నుంచి 35ఏళ్లు కలిగిన వారు అర్హులన్నారు. జూలై 9వ తేదీలోపు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సర్టిఫికేట్లు, రెండు ఫోటోలతో పులివెందుల న్యాక్ నందు సంప్రదించాలని కోరారు.

పింఛన్ల పంపిణీలో టీడీపీ నాయకులు పాల్గొనాలి

● పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి

సింహాద్రిపురం, జూన్ 28: టీడీపీ ప్రభుత్వం తొలి సారిగా జూలై 1వ తేదీన పంపిణీ చేసే పింఛన్ల కార్యక్రమంలో ప్రతి నాయకుడు సచివాలయ సిబ్బందితో కలిసి పాల్గొనాలని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి(బీటెక్ రవి) శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పులివెందుల నియోజకవర్గంలోని అన్ని మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు, డివిజన్, వార్డు అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ ఇన్‌చార్జ్‌లు ఇతర పదవుల్లో ఉన్న నాయకులు అందరూ ఆయా సచివాలయం పరిధిలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని సూచించారు. 1వ తేదీనే అధిక శాతం పింఛన్లు పంపిణీ అయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీటెక్ రవి కోరారు.

బ్రాహ్మణుల అభివృద్ధికి నిర్ణయాలు తీసుకోవడం హర్షణీయం

వేంపల్లె, జూన్ 28: దేవాలయాల్లో పనిచేసే బ్రాహ్మణుల ఆర్థిక అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయాలు తీసుకోవడం హర్షణీయమని బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌రావు, కార్యదర్శి మురళీధర్‌లు అన్నారు. శుక్రవారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించిన వెంటనే ధూప దీప నైవేద్యాలకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు పెంచడం హర్షణీయమన్నారు.

'పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి'

కడప(కలెక్టరేట్), జూన్ 28: కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ల బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆ యన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా రన్నారు. యాజమాన్యం బుక్స్, యూనిఫాం, టై, బెల్టులు అధిక ధరలకు అమ్ముకుంటున్నా అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. విద్యాశాఖ కమిషన్ల కోసం కక్కుర్తి పడకుండా మొద్దునిద్ర వీడాలన్నారు.

అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి



పెద్దకాంపల్లెలో అవినీతిపై నిలదీస్తున్న కూలీలు

సికెదిన్నె, జూన్ 28: ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల్లో అవినీతికి పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్‌పై సోషల్ ఆడిట్‌లో కూలీలు డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దకాంపల్లె పంచాయతీలో జరిగిన సోషల్ ఆడిట్‌లో కొందరికి పనిదినాలు పూర్తికాకపోయినా పూర్తయినట్లు, పనిదినాలు ఉన్నా అయిపోయినట్లు చెబుతున్నట్లు ఆరోపించారు. డబ్బు కూడా పూర్తిస్థాయిలో ఇవ్వలేదని కూలీ లు నిలదీశారు. చాలా మందికి పని కిరాకపోయినా బోగస్ జాబ్‌కార్డులు తయారు చేసి వంద రోజులు పనిచేసినట్లు చూపిస్తున్నారని, ఫీల్డ్ అసిస్టెంట్‌కు అనుకూలమైనవారిని మేటిగా పెట్టుకుని డబ్బు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అందుకు పైస్థాయి అధికారి కూడా సహకారం అందిస్తున్నట్లు ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్ లక్షలు రూపాయలు అక్రమంగా సంపాదించాడని, అవినీతిని బయటికి తీసుకురావాలని కూలీలకు న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని కూలీలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

సీకేదిన్నె, జూన్ 28: సీజనల్ వ్యాధులపట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హోమియోపతి వైద్యాధికారి షాకీర్ హుస్సేన్ తెలిపారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ హైస్కూలులో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపట్ల అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రత పాటించి ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఈ కాలంలో డయేరియా, మలేరియా, తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన ఎంతో ముఖ్యం

సీకేదిన్నె, జూన్ 28: శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న విజ్ఞానం కంటే క్షేత్రస్థాయిలో సందర్శించి నేర్చుకోవడం ద్వారా ఎంతో ప్రయోజనం ఉంటుందని కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త సాయి మహేశ్వరి తెలిపారు. వానపాముల ఎరువుల తయారీపై స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు స్థానికంగా ఉండే వానపాముల షెడ్ పరిశీలించి తయారు చేయు విధానాన్ని ప్రత్యక్షంగా చూపించడం జ రిగింది. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, మానస, సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1న ఇంటి వద్దే పింఛన్ పంపిణీ

వీరపునాయునిపల్లె, జూన్ 28: 1వ తేదీన లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్ పంపిణీ జరుగుతుందని ఎంపీడీఓ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున లబ్ధిదారులు ఎవరు సచివాలయం వద్దకు రావాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు జూలై 1న సచివాలయ సిబ్బంది ఉదయం 6గంటలకే మీ ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందిస్తారన్నారు.

సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించండి

● డీఈఓకు యుటీఎఫ్ వినతి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నేతలు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 28 : ఉన్నత పాఠశాలల్లో పని చేస్తూ ఇటీవల పదవీ విరమణ పొందిన సబ్జెక్టు టీచర్ల స్థానంలో ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని అప్పటి వరకు తాత్కాలిక పని సర్దుబాటు కింద ఉపాధ్యాయులను నియమించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేశ్‌బాబు కోరారు. శుక్రవారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ అనురాధను కలిసి వినతిపత్రం అందించారు. యూటీఎఫ్ నాయకులు రమణ, సురేష్, గోపినాథ్, చంద్రశే ఖర్ పాల్గొన్నారు.

నేడు, రేపు దశ కోటి కృష్ణ మంత్ర మహాయోగం

కడప (కల్చరల్), జూన్ 28 : లోకకళ్యాణార్థం హిందూ సమాజంలో ధార్మిక తత్వాన్ని, ఆధ్యాత్మికతను పెంచాలన్న ఉద్దేశ్యంతో దశ కోటి కృష్ణ కోటి కృష్ణ మంత్ర జప మహాయోగం, సరస్వతి మహాయాగములను ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆధ్యాత్మ విద్యా ప్రతిష్టానం అధ్యక్షుడు డాక్టర్ మాళిగి విద్యానిధి ఆచార్య తెలిపారు. కృష్ణభగవానుడి కృపాకటాక్షాలతో గత ఏడేళ్లుగా ఈ యాగాలను నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా నిర్వహిస్తామని తెలిపారు. శుక్ర వారం కడప నగరంలోని బ్రాహ్మణ వీధిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 29న శనివారం ఉదయం గోపూజ, పుణ్యవచనం, శ్రీసత్యభామ రుక్మిణీ సమేత శ్రీకృష్ణ పరమాత్ముని వివాహం నిర్మిస్తామన్నారు. 30న ఆదివారం దశ కోటి కృష్ణమంత్ర జప మహాయాగం, సరస్వతి మహాయాగం నిర్వహిస్తామని తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం అందించండి

పెండ్లిమర్రి, జూన్ 28: మండలంలోని చెర్లోపల్లె పంచాయతీలోని చిన్నదాసరిపల్లె ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని సర్పంచు సంగటి గంగిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు.

ఉపాధ్యాయులు సమసమాజ నిర్మాతలు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 28 : ఉపాధ్యాయులు సమసమాజ నిర్మాతలని కడప ఎంఈఓ పాలెం నారాయణ, ఇర్షాద్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం కడప నగరం ఎంఈఓ కార్యాలయంలో 2024 జనవరి నుండి పదవీ విరమణ పొందిన 18 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘఃనాయకులు తిరుపాల్, శివారెడ్డి, విశ్వనాథరెడ్డి, చెన్నకేశవరెడ్డి, ,రామాంజనేయులు, నరసారెడ్డి, నరసింహులు, రమణారెడ్డి, బాలానాయుడు పాల్గొన్నారు.

సీమ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 28: రాయలసీమ ప్రాంత అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని రాయలసీమ కమ్యూనిస్టు రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన పార్టీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో రవిశంకరరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో జరిగిన తప్పులను ఈ ప్రభుత్వం చేయకుండా రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు.సీనియర్ నాయకులు లింగమూర్తి, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మగ్బుల్‌బాషా పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమను వెంటనే నిర్మించాలి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 28 : జిల్లాలో ఉక్కు పరిశ్రమను వెంటనే నిర్మించాలి పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనరు కన్నెలూరు శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పీఆర్ఎస్‌వైఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్ష ఉక్కు పరిశ్రమ అని, కడప ఉక్కు రాయలసీమ హక్కు అనే నినాదంతో ప్రజలు యువత నిరుద్యోగులు అనేక పోరాటాలు నిర్వహించి పాలకవర్గాలపై ఒత్తిడి పెంచి శంకుస్థాపన చేశారన్నారు.

నేటి నుంచి కోగటం ఉరుసు

కమలాపురం రూరల్, జూన్ 28:మండల పరిధిలోని కోగటం గ్రామంలో వెలసిన హజరత్ సయ్యద్‌షా ఆలంపీర్ ఖుద్దిససిర్రహ ఉరుసు శనివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం గంధం, ఆదివారం ఉరుసు ఉత్సవాలను కోగటం గ్రామ ప్రజలు నాయకులు సహకారంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. అనంతరం ఖవ్వాలి ఉంటుందన్నారు.

శ్మశానవాటికలో మురికినీటిని తొలగించాలి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 28:రామరాజుపల్లె గూడూరు హరిజనవాడలో దళితుల శ్మశానవాటికలో వర్షం నీరు, మురుగునీరు చేరిందని, దీన్ని వెంటనే తొలగించాలని డీఎస్‌పీఎస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇమ్మానుయేల్, మునెయ్య మాట్లాడుతూ గత మూడేళ్ల నుంచి స్పందన కార్యక్రమంలో శ్మశాన వాటిక అభివృద్ధి చేయాలని పలుమార్లు వినతిపత్రం ఇచ్చినా కమిషనరు కానీ, అధికారులు కానీ స్పందించలేదన్నారు. గ్రామంలో అనారోగ్యంతో ఒక బాలిక చనిపోయిందని శ్మశానంలో పూడ్చాలంటే మురికినీరు, వర్షం నీటితో నిండి ఉందన్నారు. ఇది చాలా ఇబ్బందికరంగా ఉందని, ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి శ్మశాన వాటికను అభివృద్ధి చేసి వర్షం నీరు, మురుగు శ్మశానంలోకి రాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక దళితులు చంద్ర, చెన్నకేశవులు, ఇంద్ర, శివ, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

'పి.వి నరసింహారావు ఆర్థిక మాంత్రికుడు'

వేంపల్లె, జూన్ 28: స్వర్గీయ పీవీ నరసింహారావు ఆర్థిక మాంత్రికుడని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తులసిరెడ్డి కొనియాడారు. శుక్రవారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు స్వర్గీయ పీవీ నరసింహారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. తులసిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతరపున 20ఏళ్లు శాసన సభ్యునిగా, రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా సేవలందించారన్నారు. ముఖ్యమంత్రిగా చారిత్రాత్మకమైన భూసంస్కరణ చట్టాన్ని తెచ్చారన్నారు. క్లిష్ట సమయంలో భారత ప్రధానమంత్రి పదవి స్వీకరించి మైనారిటీ ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడిపి, ఆర్థిక సంస్కరణలు చేపట్టి దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి కాపాడిన ఆధునిక భారత నిర్మాత పివి నరసింహారావు అన్నారు

'పెన్షన్ పంపిణీ నుంచి ఆశాలను మినహాయించండి'



డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న వేణుగోపాల్

కడప (మారుతీనగర్), జూన్ 28 : సామాజిక పెన్షన్ల పంపిణీ నుంచి ఆశా వర్కర్లను మినహాయించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం క డ ప డీఆర్వోను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. వచ్చే జూలై 1న రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కాగా జిల్లాలో సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆశా వర్కర్లతో చేయించేలా జిల్లా వైద్య శాఖ అధికారులు ఒత్తడి చేయడం సరైంది కాదన్నారు. తక్షణమే ఆ నిర్ణయం ఉపసంహరించుకోవాలన్నారు. కాగా జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని సంబంధిత మెడికల్ ఆఫీసర్లు ఆ పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆశావర్కర్లతో పంపిణీ చేయించేలా వీరి ఆధార్ కార్డులు, పాన్‌కార్డులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. సామాజిక పెన్షన్లు పంపిణీ చేసే అంత పరిజ్ఞానం లేని ఆశావర్కర్లు చాలా మంది ఉన్నారన్నారు. కావున పెన్షన్ల పంపిణీ నుంచి ఆశావర్కర్లకు మినహాయింపునివ్వాలని కోరారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతమ్మ, కోశాధికారి అమ్ములు, ఉపాధ్యక్షురాలు అనసూయ పాల్గొన్నారు.

వ్యవసాయ సమస్యలపై సమావేశం ఏర్పాటు చేయాలి

● ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 28: రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అఖిలపక్ష రైతు సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో వర్షాలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ యంత్రాలు, రుణాలు తదితర అంశాలపై తక్షణం అధికార యంత్రాంగం తీసుకోవాల్సిన చర్యలపై సీఎం చంద్రబాబునాయుడి నేతృత్వంలో అఖిలపక్ష రైతు సంఘాల సమావేశం నిర్వహించాలన్నారు. వారంలో ఒక రోజు పోలవరం ప్రాజెక్టు పర్యవేక్షణకు సమయాన్ని కేటాయించిన సీఎం నిత్యం కరువు, వలసలు ఆత్మహత్యలకు నిలయంగా మారిన రాయలసీమ నీటిపారుదల ప్రాజెక్టులైన గాలేరు నగరి, హంద్రీనీవా తెలుగుంగ రాజోలి, వెలిగొండ ప్రాజెక్టుల పనుల పర్యవేక్షణకు కూడా సమయం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగంలో నిజాయితీనే ఆదర్శం: తహసీల్దార్



ఖాదర్‌బాషాను సన్మానిస్తున్న తహసీల్దారు, టీడీపీ నేతలు

చెన్నూరు, జూన్ 28:ఏ ఉద్యోగికి అయినా విధి నిర్వహణలో నిజా యితీనే ఆదర్శమని చెన్నూరు తహసీల్దారు ప్రకాశ్ బాబు అన్నారు. 36 ఏళ్ల పాటు విధులు నిర్వహించిన అటెండరు షేక్ ఖాదర్‌బాషా శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆ కార్యాలయ ఆ వరణంలో ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగాగా తహసీల్దారు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి అటెండగారు పనిచేస్తున్న ఖాదర్ బాషా నిజాయి తీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి మాట్లాడుతూ ఖాదర్‌బాషా చిన్న ఉద్యోగి అయినా పెద్ద ఉద్యోగులు సైతం ఆయ న్ను గౌరవించేవారన్నారు. అనంతరంప ఖాదర్‌బాషాను రెవె న్యూ కార్యాలయ సిబ్బంది, టీడీపీ నేతలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో మం డల సర్వేయరు సోమశేఖర్, సీనియర్ అసిస్టెంటు క్రిష్ణవేణి, ఆర్ఐలు సుజన, సౌజన్య, వీఆర్వోలు సుధీర్, శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, నారాయణ పాల్గొన్నారు.

మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన పుత్తా లక్ష్మీరెడ్డి



మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన లక్ష్మీరెడ్డి

పెండ్లిమర్రి/కమలాపురం, జూన్ 28: రాష్ట్ర రవాణా మరియు యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిని కమలాపురం నియోజకవర్గ యువనేత పుత్తా లక్ష్మీరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం రాయచోటిలోని క్యాంప్ కార్యాలయంలో మం త్రిని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువతో సత్కరించారు. అనంతరం మంత్రితో లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని పాఠశాలలు, కళాశాలలో క్రీడల అభివృద్ధికి సహకరించాలని, క్రీడలకు సంబంధించిన మౌలిక వసతులైన ఆటస్థలాలు, క్రీడా సామాగ్రి తదిత ర సౌకర్యాలు కల్పించాలని, యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిచాలని, క్రీడల్లో రాణించిన వారికి ప్రోత్సహకాలు అందించాలన్నారు.

రాయచోటి-వేంపల్లె రూట్‌లో అదనపు సర్వీసులను ఏర్పాటు చేయాలి

చక్రాయపేట, జూన్ 28: రాయచోటి-వేంపల్లె రోడ్డు పనులను త్వరితగతినపూర్తి చేసి ప్రజలుపడుతున్న ఇబ్బందులను తొలగించాలని బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు కె.రామచంద్రారెడ్డి కోరారు. శుక్రవారం రాష్ట్ర రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఆయన వినతిపత్రం సమర్పించారు.

'వ్యాయామ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి'

కడప (మారుతీనగర్), జూన్ 28:వ్యాయామ ఉపాధ్యాయులకు ఒక సంవత్సరం బ్రిడ్జ్ కోర్సు ఏర్పాటు చేసిన తద్వారా వారిని పాఠశాల సహాయకులుగా పదోన్నతులు కల్పించాలని జిల్లా స్కూలు అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివశంకరరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో రాయచోటిలోని క్రీడాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు.

ముగ్గురు ఆకతాయిలపై కేసు నమోదు

కడప (క్రైం), జూన్ 28 : కడప నగరంలోని తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో రవీంద్రనగర్‌కు చెందిన ముగ్గురు ఆకతాయిలపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ తెలిపారు. ఆయన వివరాల మేరకు... రవీంద్రనగర్‌కు చెందిన సయ్యద్ తమన్నా (16) పదో తరగతి చదువుతోంది. ఈమెను అదే ప్రాంతానికి చెందిన రహ్మత్తుల్లా, ఫయాజ్ తదితరులు కామెంట్ చేసేవారు. కాగా తమన్నా తమ్ముడు ఇమ్రాన్ వారిని పద్ధతి మార్చుకోవాలని చెప్పగా రహ్మతుల్లా గొడవ పడ్డాడు. విషయం తెలుసుకున్న తమన్నా తల్లి సయ్యద్ రిజ్వానా పర్వీన్ అక్కడికి వచ్చి రహ్మతుల్లాను నిలదీయాలని రాగా రహ్మతుల్లాతో పాటు మరో ఇద్దరు వారిపై దాడికి దిగారు. ఈ క్రమంలో బాధితురాలు రిజ్వానా పర్వీన్ తన చీర జాకెట్‌ను చించి వేసి దాడికి పాల్పడ్డారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులు ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్టుచేసినట్లు తెలిపారు. ఆ ముగ్గురు నిందితులను కోర్టులో మెజిస్ట్రేట్ ముందు శుక్రవారం హాజరు పరచగా రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

నలుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు

కడప (క్రైం), జూన్ 28: కడప జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న నలుగురు సిబ్బందిని శుక్రవారం ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణాలో వారి ప్రమేయం ఉన్నట్లు విచారణలో తేలడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. బద్వేలు అర్బన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సుధాకర్, అట్లూరు పీఎస్ కానిస్టేబుల్ రామకృష్ణ, ప్రొద్దుటూరు 3 టౌన్ హెడ్‌కానిస్టేబుల్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

పింఛన్ల పంపిణీని విజయవంతం చేయాలి

● సిబ్బందికి కమిషనర్, ఎంపీడీఓ సూచన

పులివెందుల రూరల్, జూన్ 28: పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఎంపీడీఓ దివాకర్ ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఎంపీడీఓలు సచివాలయ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. శనివారం పింఛన్ నగదు బ్యాంకు నుంచి డ్రా చేసుకోవాల్సి ఉంటుందన్నారు. జూలై 1వ తేదీ సోమవారం ఉదయం 5గంటల నుంచి లబ్ధిదారులకు పంఛన్ పంపిణీని ప్రారంభించాలన్నారు. అలాగే లబ్ధిదారులు ఇంటి వద్దే ఉండి పింఛన్ తీసుకోవాలన్నారు. పింఛన్ కోసం ఎవరు సచివాలయం వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా పింఛన్ సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు.

పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సింహాద్రిపురం, జూన్ 28: పింఛన్ల పంపిణీలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఏపీ ఎంఐపీ పీడీ, మండల ప్రత్యేక అధికారి రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో శుక్రవారం పింఛన్ల పంపిణీపై సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 5623 మందికి ప్రభుత్వం పింఛన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పింఛన్లు సచివాలయ సిబ్బంది పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. 1వ తేదీ సోమవారం ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ కార్యక్రమం మొదలు పెట్టాల్సి వుంటుందని కలెక్టర్ నుంచి ఆదేశించినట్లు ప్రత్యేక అధికారి వారికి తెలిపారు. నిర్ణీత సమయంలో పింఛన్లు పంపిణీ చేసేలా అందరూ కృషిచేయాలన్నారు. పింఛన్ల పంపిణీలో ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే ఎంపీడీఓ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

వాహనం సహా 'ఎర్ర' దుంగలు స్వాధీనం

● ఒకరి అరెస్టు.. ఇద్దరు పరార్

● ఎర్రచందనం స్మగ్లింగ్‌లో ఇద్దరు పోలీసులు



బద్వేలు రూరల్, జూన్ 28 : రాణిబావి సమీపం లోతువంక బీట్ గాజులగొంది వద్ద వాహనంలో రవాణాకు సిద్ధంగా ఉంచిన నాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జి ఫారెస్టు ఆఫీసరు శేషయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు కూంబింగ్‌లో భాగంగా రాణిబావి సమీపంలోని లోతువంక బీట్ గాజులపల్లె వద్దకు వెళ్లగానే ఇథియోస్ వాహనం ఎదురు పడిందదన్నారు. దానిని తనిఖీ చేసేందుకు ప్రయత్నించగా కారులో ఉన్న ఇద్దరు పరారు కాగా, డ్రైవర్ షఫీవుల్లాను అరెస్టు చేసి వాహనంతో సహా నాలుగు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారైన వ్యక్తులు రేకలకుంట్లకు చెందిన గంజినాయుడు, నాగసానిపల్లెకు చెందిన బ్రహ్మనాయుడుగా గుర్తించామన్నారు. లోతువంక బీట్ గాజులగొంది వద్ద పట్టుబడ్డ ఎర్రచందనం స్మగ్లింగ్‌లో పోలీసుల పాత్ర ఉన్నట్లు ఇన్‌చార్జి ఫారెస్టు ఆఫీసరు శేషయ్య తెలిపారు. బద్వేలు అర్బన్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సుధాకర్, అట్లూరు పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న రామక్రిష్ణ వీరికి సహకారం అందిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. వీరందరూ ఓ గ్రూపుగా ఎర్రచందనం దుంగలను తరలించేందుకు సిద్ధంగా ఉంచారని విచారణలో తేలిందన్నారు. వీరందరినీ త్వరలోనే పట్టుకుంటామన్నారు.

ఘాట్‌లో లారీని ఢీకొన్న మరో లారీ



సీకేదిన్నె, జూన్ 28: కడప-రాయచోటి జాతీయ రహదారిపై గువ్వలచెరువు ఘాట్ 4వ మలుపు వద్ద ఆగి ఉన్న లారీని వెనుకవైపు నుంచి మరో లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. అయితే ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరుగలేదు. ఈ ఘటనలో లారీ ముందుభాగం దెబ్బతింది. ఘటనలో లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

జాగ్రత్తలతో డయేరియా నివారణ

డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ నాగరాజు



అవగాహన కల్పిస్తున్న డీఎంఅండ్ హెచ్ఓ నాగరాజు

కడప(కలెక్టరేట్), జూన్ 28: కలుషితమైన తాగు నీరు, ఆహారం తినడం వల్ల అతిసార వ్యాధి ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం నగర కార్పొరేషన్ పరిధిలోని పాతకడపలో వైద్యసిబ్బంది చేపట్టిన డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని డీఎంఅండ్ హెచ్ఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా లాంటి విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు ఉత్పత్తి జరిగే అవకాశం ఉందన్నారు. దోమకాటు వల్ల విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. వారానికి ఒకసారి అయినా తాగునీరు నిల్వ చేసుకునే బానలు, తొట్లు, కుండలను శుభ్రం చేసుకుని కొంత సేపు ఎండబెట్టాలన్నారు. అప్పుడు దోమలు పెరిగేందుకు అవకాశం ఉండదన్నారు. అలాగే డయేరియా నియంత్రణకు తాగునీరు కాచి చల్లార్చి తాగాలన్నారు. కుళాయిలు లీకేజీ ఉంటే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. తాగునీటి పైపుల్లో బురద నీరు వస్తోందని పాతకడపవాసులు డీఎంఅండ్‌హెచ్ఓ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే రూరల్ వాటర్ ఇంజనీరింగ్ అధికారిని పిలిపించి మరమతులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారిణి మనోరమ, అసిస్టెంట్ అధికారి వెంకటరెడ్డి, సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మీరెడ్డి, శంకర్ రెడ్డి, ఇంతియాజ్, వైద్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీజీ ప్రవేశ పరీక్షలో 4వ ర్యాంక్



ముజఫర్ హుస్సేన్

గాలివీడు, జూన్28: ఏపీ పీజీ సెట్ ఫలితాల్లో గాలివీడు విద్యార్థి ముజఫర్ హుస్సేన్ 4వ ర్యాంకు సాధించాడు. పెద్దూరులో నివాసముంటున్న షేక్ మహమ్మద్ కుమారుడు ముజఫర్ హుస్సేన్ ఉర్దూ విభాగంలో మెరుగైన ర్యాంకును సాధించాడు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశానని, ఎస్వీ యూనివర్శిటీలో ఎంఏ (ఉర్దూ) పూర్తి చేసి యూపీఎస్సీ ద్వారా ఉద్యోగం సాధించాలన్నదే తన ఆశ యమని విద్యార్థి తెలిపారు.

గండి దేవస్థాన సహాయ కమిషనర్‌గా వెంకటసుబ్బయ్య

చక్రాయపేట, జూన్ 28: రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి వీరాంజనేయ స్వామి దేవస్థాన సహాయ కమిషనర్‌గా జె.వెంకటసుబ్బయ్య నియమితులయ్యారు. గండి దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న అలవలపాటి ముకుందరెడ్డిని కమిషనర్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటసుబ్బయ్య నెల్లూరు జిల్లా రాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నుంచి గండికి బదిలీ అయ్యారు.

పంచాయతీలను సర్వనాశనం చేశారు

● 14, 15 ఫైనాన్స్ నిధులను దారిమళ్లించారు

● స్టాంప్ డ్యూటీ.. స్టేట్ ఫైనాన్స్ నిధులు ఇవ్వలేదు

● 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం సమీక్షలో...

● వైసీపీ ప్రభుత్వ తీరుపై సర్పంచ్‌ల ఆగ్రహం

కడప(రూరల్) జూన్ 28: వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలను సర్వనాశనం చేశారని, తమకు కనీసం గ్రామ వలంటీర్లకు ఇచ్చే గౌరవం కూడా ఇవ్వలేదని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో శుక్రవారం సాయంత్రం గ్రామ పంచాయతీ నిధులు - ఖర్చు - ఆదాయ వనరుల పెంపు అంశాలపై 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం ప్రతినిధుల బృందం సర్పంచ్‌లతో సమీక్ష నిర్వహించింది. ఈ కార్యక్రమం ప్రారంభం కాగానే ఉమ్మడి కడప జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శివచంద్రారెడ్డి, పోరుమామిళ్ల మేజర్ పంచాయతి సర్పంచ్ సుధాకర్ తదితరులు మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం గ్రామపంచాయతీల వ్యవస్థను కోలుకోలేని రీతిలో సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పంచాయతీలకు సమకూరే 14, 15 ఫైనాన్స్ నిధులను దారిమళ్లించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన స్టాంప్ డ్యూటీ, స్టేట్ ఫైనాన్స్ నిధులు కూడా ఇవ్వలేదన్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ (ఉడా) అథారిటీని తీసుకొచ్చి పంచాయతీలకు గుదిబండగా మార్చారని ఆవేదన చెందారు. గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేస్తున్న వెంచర్లలో ప్రభుత్వ అవసరాలకు ఒక ఎకరాకు 10 శాతం భూమి పంచాయతీకి కేటాయించాల్సి ఉందని కానీ ఉడా కారణంగా ఇది జరగడం లేదన్నారు. పంచాయతీ రిజల్యూషన్ లేకుండానే ఉడా అధికారులు ప్రైవేట్ వెంచర్లకు అనుమతులు ఇస్తున్నారన్నారు. అలాంటప్పుడు సర్పంచ్‌ల వ్యవస్థ ఎందకని ప్రశ్నించారు. ఉడా అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో లాలూచి పడి సర్పంచ్‌లకు తెలియకుండానే మీటింగ్‌లు ఏర్పాటుచేసుకుని వెళ్లిపోతున్నారన్నారు. 5 సెంట్ల ప్లాన్ అప్రూవల్‌కు పంచాయతీకి 14 శాతం కట్టేవారని ఉడా వచ్చిన తరువాత అలాంటిది జరగడం లేదన్నారు. ఇప్పటి వరకు తమ పంచాయతీలో కమర్షియల్‌కు రూ.73 లక్షలు, రెసిడెన్షియల్‌కు రూ.55 లక్షలు మొత్తం రూ.1.22 కోట్లు రావాలని సర్పంచ్‌ల సంఘం అద్యక్షుడు శివచంద్రారెడ్డి పేర్కొన్నారు.

వైసీపీ ప్రభుత్వ ద్వంద్వ వైఖరితో..

పంచాయతీ రిజల్యూషన్ లేనిదే ఉడా ఏమి చేయకూడదన్నారు. తమ కొత్తపల్లె పంచాయతీలో 50 మంది సచివాలయ ఉద్యోగులు, 150 మంది వలంటీర్లు ఉన్నారని అయినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. తలసరి గ్రాంటు 30 సంవత్సరాల క్రితం రూ.4 ఉండేదని ఇప్పుడు కూడా అదే కంటిన్యూ అవుతోందని దీనిని రూ.100కు పెంచాలన్నారు. తమ కష్టాలు చెప్పుకోవడానికి కూడా గత వైసీపీ ప్రభుత్వం అవకాశం ఇచ్చేది కాదన్నారు. కనీసం స్ట్రీట్ లైట్లు కూడా కొనే అర్హతలేకుండా చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వ ద్వంద్వవైఖరి కారణంగా గ్రామాలలో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించలేక అవమానంతో పలువురు సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. గత వైసీపీ పాలనలో ఇక్కట్లు, అవమానాలు తప్ప ఎలాంటి అభివృద్ధి చేయలేకపోయామన్నారు. పూర్తిగా దెబ్బతిని రోడ్డున పడ్డామన్నారు.



మాట్లాడుతున్న పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్

జీతాలు కూడా ఇవ్వలేని స్థితి

పోరుమామిళ్ల మేజర్ పంచాయతీలో తాను సర్పంచ్ అయ్యే సమయానికి రూ.1.50 కోట్లు నిధులు ఉండేవని సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టగానే ఆ నిధులను అప్పటి వైసీపీ ప్రభుత్వం తమకు తెలియకుండానే ఖర్చుచేసిందని సర్పంచ్ సుధాకర్ వాపోయారు. పైగా తాను సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన నాటికి 9 నెలల జీతాలు పెండింగ్‌లో ఉండేవన్నారు. ఒక నెలకు 3లక్షల 50వేలు ఖర్చువస్తోందన్నారు. ఇప్పుడు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితికి గత వైసీపీ పాలకులు తీసుకొచ్చారన్నారు. ఈ సమస్యలు ప్రతి గ్రామ పంచాయతీలో ఉన్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలోని టీడీపీ పాలనలో గ్రామపంచాయతీలకు పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సర్పంచ్‌ల గౌరవవేతనాన్ని రూ.10వేలకు పెంచుతామని సీఎం చంద్రబాబు చెప్పడం అనందంగా ఉందన్నారు. నూతనంగా ఏర్పడిన టీడీపీ ప్రభుత్వ పాలనలో గ్రామ పంచాయతీల ఆర్థిక వనరులను, సమస్యలను తెలుసుకొని పరిష్కార మార్గాలు చూపడానికి 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం ప్రతినిధుల బృందాన్ని పంపి సర్పంచ్‌లతో సమీక్షించడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం సెక్రటరీ రమణారెడ్డి, మెంబర్లు ప్రసాద్‌రావు, పద్మారావు, కృపారావు, డీపీవో ప్రభాకర్‌రెడ్డి, పరిపాలనాధికారి ఖాదర్‌బాషా, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మొండి బకాయిలు వసూలయ్యేనా?

జప్తు చేస్తామని వెళ్లిన అధికారులకు నేతల ఫోన్లు ● నోటీసులు ఇచ్చినా, కేసులు వేసినా బెదరని వైనం

పులివెందుల రూరల్, జూన్ 28: పులివెందుల మున్సిపాలిటీలోని మొండి బకాయిల వసూళ్లకు మున్సిపల్ అధికారులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. మొండి బకాయిల వసూళ్లకు మున్సిపాలిటీ ప్రత్యేక కార్యక్రమం చేపట్టినా అనేక మంది పట్టించుకోలేదు. ప్రైవేటు ఆస్తుల పన్నులు వసూలు అవుతున్నప్పటికి ఓ ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన వాణిజ్య ఆస్తులకు పన్ను కట్టకపోవడం ఒకింత ఆశ్చర్యకరం.

పులివెందులలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న ఏపీఎన్జీఓ అసోసియేషన్‌కు సంబంధించిన కోట్ల విలువైన స్థలంలో రెండు అంతస్తుల్లో వాణిజ్య సముదాయం నిర్మించారు. వాటికి లక్షల రూపాయల అడ్వాన్స్‌ల రూపంలో తీసుకోవడంతో పాటు నెలనెలా రూ.10వేల నుంచి రూ.20వేల వరకు అద్దెలు వసూళ్లు చేస్తున్నారు. ఈ సముదాయానికి సంబంధించి దాదాపు ఎనిమిది లక్షల రూపాయల వరకు పన్నులు బకాయి ఉన్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. 13ఏళ్ల నుంచి పన్నుల వసూళ్ల కోసం నానా తంటాలు పడుతున్నా చెల్లించలేదని అంటున్నారు. ఆ సముదాయంలో ఎనిమిది వాణిజ్య గదులు, ఎస్బీఐ, ఫంక్షన్ హాల్ ఉన్నాయి. లక్షల రూపాయలు అడ్వాన్స్‌ల రూపంలో చెల్లించామని, నెలనెల అద్దెలు కూడా వసూలు చేస్తున్నారని అక్కడున్న వ్యాపారులు చెబుతున్నారు. అంటే నెలకు దాదాపు లక్ష నుంచి లక్షన్నర రూపాయల వరకు ఆదాయం వస్తుంది. అయితే.. ఏడాదికి ఒక్కసారి మాత్రమే మున్సిపాలిటీకి వేలల్లో చెల్లించాల్సిన పన్నులు మాత్రం ఎన్జీవో అసోసియేషన్ వారు కట్టడం లేదు. మున్సిపాలిటీ అభివృద్ధికి ఉపయోగపడేందుకు పన్నులు వసూలు చేస్తున్నారని తెలిసినా సాటి ప్రభుత్వ ఉద్యోగులే ఇలా పన్నులు చెల్లించకపోవడం ఏమిటని పలువురు అధికారులే ప్రశ్నిస్తున్నారు. పన్ను కట్టాల్సిన అవసరం లేదని ప్రభుత్వం జీఓ ఇచ్చిందని ఎన్జీఓ నేతలు అంటున్నారు. అయితే ఆ జీఓలో ఏముందనేది ఇప్పటి వరకు తెలియదని మున్సిపల్ అధికారులు అంటున్నారు. భారీగా ఆదాయం సమకూరుతున్న వాణిజ్య సముదాయానికి పన్ను వసూలు చేయవద్దని ఏ ప్రభుత్వం చెప్పదు అనేది అధికారుల మాట.



పులివెందులలో పన్నులు చెల్లించని ఏపీఎన్జీఓ వాణిజ్య సముదాయం

జప్తు చేసేందుకు వెళ్లారు, వెనక్కితగ్గారు

ఇక్కడి గదులు ఉద్యోగులకే ఉపయోగిస్తున్నారా, లక్షల్లో ఆదాయం ఆర్జిస్తున్నారు కదా పన్ను కట్టమంటే ఎందుకు కట్టడం లేదని అప్పటి కమిషనర్ నరసింహారెడ్డి ఏన్జీఓ సంఘనేతలను ప్రశ్నించారు. ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు. అన్ని ఏర్పాట్లు చేసుకొని తీరా నోటీసులు ఇచ్చే సమయానికి వైసీపీ పెద్దల నుంచి ఫోన్లు రావడంతో వెనక్కి తగ్గారు. నామమాత్రంగా నోటీసులు ఇచ్చి వెళ్లిపోయారు. కాగా ఎన్జీఓ సంఘానికి ప్రభుత్వం ప్రత్యేకంగా పర్మిషన్ ఇచ్చిందని జీఓ ఇచ్చిందని, పన్ను కట్టాల్సిన అవసరం లేదని ఆ సంఘనేతలు అంటున్నారని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. అయితే ఇంతవరకు తమకు ఆ జీఓ చూపలేదని చెబుతున్నారు.

కేసు పెట్టాం

- రఘు, రెవెన్యూ అధికారి, పులివెందుల మున్సిపాలిటీ

ఎన్జీఓ సముదాయానికి సంబంధించి పన్ను వసూలుకు పలుమార్లు నోటీసులు ఇచ్చాం. దాదాపు రూ.8లక్షలు బకాయి ఉంది. పన్ను వసూలుకు కేసు వేశాం. ప్రస్తుతం కేసు కోర్టులో ఉంది.

వీరభద్రస్వామి హుండీల ఆదాయం రూ.22 లక్షలు



రాయచోటిటౌన్, జూన్28: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవ స్థానంలో హుండీల ఆదాయం రూ.22 లక్షలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీ రమణారెడ్డి తెలియజేశారు. దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు హుండీల లెక్కింపు జరిగింది. 90 రోజులకు ఆలయాల హుండీల ఆదాయం రూ.21 లక్ష 35 వేల 855లు రాగా, 35 గ్రాముల 600 మిల్లీ గ్రాముల బంగారం, ఒక కేజీ 857 గ్రాముల వెండి, అన్నదానం హుండీ ద్వారా రూ.1 లక్ష 4 వేల 290లు ఆదాయం వచ్చినట్లు ఆయన తెలియజేశారు.

ఎస్బీఐని సందర్శించిన డీజీఎం




అధికారులతో మాట్లాడుతున్న డీజీఎం దినేష్ గులాటి

కడప (నాగరాజుపేట), జూన్ 28 : నగరంలోని ప్రధాన భారతీయ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా కార్యాలయాన్ని కర్నూలు, కడప, అనంతపురం ఉమ్మడి జిల్లాల కర్నూలు జోన్ ప్రత్యేక అధికారి డిప్యూటీ జనరల్ మేనేజరు దినేష్ గులాటి శుక్రవారం సందర్శించారు. ఆయనకు బ్యాంకు చీఫ్ మేనేజరు మధుసూదన్‌రావు స్వాగతం పలికారు. అనంతరం ఆయన బ్యాంకు అధికారులతో సమీక్షించారు. అనంతరం ఖాతాదారులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మేనేజరు మధుసూదన్ రావు, మేనేజరు శశిధర్, సీనియర్ క్లర్క్ సంధ్యారాణి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల్లో చిగురిస్తున్న ఆశలు

● కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో.. ● బతుకులు బాగుపడతాయనే భరోసాలో ఉద్యోగులు



అది ఘనత వహించిన ఏపీఎస్ఆర్టీసీ. రాత్రి, పగలూ అనే తేడా లేకుండా నిత్యం లక్షలాది మంది ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరవేస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 54 వేల మంది వివిధ స్థాయి కార్మికులు, ఉద్యోగులు సేవలందిస్తున్నారు. వీరి ఆశలపై నీళ్లు చల్లేలా గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలన సాగింది. 2020 జనవరి 1న ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిందే కానీ వారికి ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో సమానమైన సదుపాయాలు కల్పించకుండా చేతులెత్తేసింది. దీంతో ఆర్టీసీ ఉద్యోగుల ముఖాలలో చిరునవ్వు మాయమైంది.

కడప (మారుతీనగర్), జూన్ 28: ప్రధానంగా ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనమైతే ప్రభుత్వ ఉద్యోగుల వలే పెన్షన్ వస్తుందనే ఆశ నీరుగారిపోయేలా చేయడంతో ఉద్యోగులంతా ఒక రకమైన మానసిక అశాంతికి గురయ్యారు. పెన్షన్ ఇవ్వకపోగా.. విలీనం కాకముందు ఆర్టీసీ ఉద్యోగులకు వచ్చే స్టాఫ్ రిటైర్‌మెంట్ బెనిఫిట్ స్కీమ్ ద్వారా అందే చిన్నపాటి పెన్షన్ కూడా ఇవ్వకుండా పీకేశారు. పైపెచ్చు ఉద్యోగుల జీతాల నుంచి పెన్షన్ స్కీంకు మినహాయించిన డబ్బులు కూడా ఇంకా కొంత మంది ఉద్యోగులకు చెల్లించలేదనే ఆరోపణలున్నాయి. దీంతో పాటుగా స్టాఫ్ రిటైర్‌మెంట్ బెనిఫిట్ ట్రస్ట్ (ఎస్బీటీ) సదుపాయాన్నికూడా ఉద్యోగులకు చెల్లించకుండా తొలగించింది. అంతటితో ఆగకుండా ఉద్యోగులు మాకొద్దు అని మొత్తుకున్నా ఎంప్లాయిస్ హెల్త్ స్కీం (ఈహెచ్ఎస్) కార్డులను బలవంతంగా వైసీపీ ప్రభుత్వం అంటగట్టి, ఉద్యోగుల స్థాయిని బట్టి ప్రతీనెలా వారికొచ్చే జీతంలో రూ..250 నుంచి రూ.600 వరకూ కోత విధిస్తూ వచ్చింది. అందుకు తగ్గ ఆరోగ్యసేవలను అందించడంలో విఫలమైంది. పైపెచ్చు గతంలో ఉద్యోగులకు అందే వైద్యసేవలను రద్దు చేసింది. దీంతో ఆర్టీసీలో వైద్యసేవలందక.. ప్రభుత్వ వైద్యశాలల్లో సరైన వైద్యసేవలందక వీరు ఇబ్బంది పడ్డారు. విలీనం కాకముందు ఉద్యోగులకు అన్‌లిమిటెడ్ వైద్యసదుపాయాలందేవి. ఏదేని అనారోగ్య సమస్యలకు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో అందే వైద్యసేవలకు కూడా గత వైసీపీ ప్రభుత్వం మంగళం పలకడంతో స్వంత డబ్బులతో వైద్యసేవలు పొందాల్సిన దుస్థితి తలెత్తిందని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు అన్యాయం

ఆర్టీసీలో విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన ఉద్యోగులు సైతం తీవ్ర అన్యాయానికి గురయ్యారు. విలీనానికి ముందు ఆర్టీసీ ఉద్యోగులు రిటైర్‌మెంట్ కాగానే వారికొచ్చే బెనిఫిట్స్ నుంచి రూ.25వేలను సంస్థకు కట్టేవారు. లైఫ్ లాంగ్ రిటైర్డ్ ఉద్యోగితో పాటుగా ఆయన భార్యకు కూడా ఏదేని ఆరోగ్యసమస్యలకు వీలుగా ప్రతీనెలా సంబంధిత ఆర్టీసీ ఆసుపత్రిలో ఉచితంగా మందులు అందేవి. అంతేకాకుండా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో సుమారు రూ.4 లక్షల వరకూ సంస్థ భరించేది. కాగా ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయిన తర్వాత ఈహెచ్ఎస్ కార్డు ఉందనే నెపంతో రిటైర్‌మెంట్ మెడికల్ స్కీం (ఆర్ఎంఎస్)ను వైసీపీ ప్రభుత్వం తొలగించింది. దీని కారణంగా రిటైర్ అయిన తర్వాత ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ కార్డులు పనిచేయకపోవడంతో తీవ్ర నరకయాతనకు గురౌతున్నారు. అదే ప్రభుత్వ ఉద్యోగికి రిటైర్ అయిన తర్వాత పెన్షన్ వస్తుంది కాబట్టి వారికి ఈహెచ్ఎస్ కార్డుల తాలూకు వైద్యసేవలు అందుతున్నాయి. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగికి పెన్షన్ రాని కారణంగా ఈహెచ్ఎస్ కార్డు తాలూకు వైద్యసేవలందడం లేదు.

కొత్త ప్రభుత్వంపై చిగురిస్తున్న ఆశలు

గత వైసీపీ ప్రభుత్వ పాలనపై ఆర్టీసీ ఉద్యోగులు పెట్టుకున్న ఆశలు పూర్తిగా అడుగంటిపోయాయి. ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంతో తమకు మేలు జరుగుతుందనే ఆశలు ఆర్టీసీ ఉద్యోగుల్లో చిగురిస్తున్నట్లుగా చెప్పుకుంటున్నారు. ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన వైసీపీ ప్రభుత్వం ఇటీవల జరిగిన ఎన్నికలలో ఘోర ఓటమి చవిచూడడంతో ఆర్టీసీ ఉద్యోగులు సైతం హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా గాడి తప్పిన ఆర్టీసీని తిరిగి గాడిలో ఉంచగల సత్తా ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాత్రమే ఉందనే విశ్వాసంతో ఉద్యోగులున్నారు. ఇటు ఆర్టీసీ మనుగడతో పాటు తమ బతుకుల బాగుపడతాయని వీరు ఆశిస్తున్నారు.

పెన్షన్ కోసం ఆశగా..

కడప రీజియన్ పరిధిలో కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. వీటిలో డ్రైవర్లు, కండక్టర్లు 1696 మంది పనిచేస్తున్నారు. వీరిలో 866 మంది కండక్టర్లు, 830 మంది డ్రైవర్లు ఉన్నారు. వీరితో పాటు మిగ తా ఆర్టీసీ ఉద్యోగులం దరూ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా తమకు పెన్షన్ అందు తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.



ఉద్యాన పండ్ల తోటలకు దరఖాస్తు చేసుకోండి

అట్లూరు, జూన్ 28 : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పండ్ల తోటలకు దరఖాస్తు చేసుకోవాలని ప్లాంటేషన్ సూపర్‌వైజరు మల్లేశ్వర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకం 1బీ, జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు సన్నకారు రైతు సర్టిఫికెట్ సంబంధిత అధికారికి అందజేయాలని తెలిపారు.

ఉచిత శిక్షణకు...

జమ్మలమడుగు, జూన్ 28: జమ్మలమడుగు పట్టణంలో న్యాక్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కార్యక్రమం ద్వారా నిర్వహించనున్న మూడు నెలల ఉచిత నైపుణ్య శిక్షణకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని న్యాక్ సిబ్బంది తెలిపారు. జమ్మలమడుగు న్యాక్ సెంటర్‌లో కోర్సుల వివరాలు, అసిస్టెంట్ సర్వేయర్ ఎలక్ట్రిషియన్, టైలరింగ్, సీసీకెమెరా టెక్నీషియన్, కోర్సులు ఉన్నాయన్నారు. 10వ తరగతి, ఆపై చదివి ఉన్న 18 నుంచి 35 సంవత్సరాలు వయస్సు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూలై నెల 9 తేదీ లోపు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సర్టిఫికెట్స్, రెండు ఫొటోలు న్యాక్ సెంటర్ జమ్మలమడుగులోని ప్రొద్దుటూరు రోడ్డులో అందజేయాలని వారు కోరారు. వివరాలకు 9704423051ను సంప్రదించాలని కోరారు.

ఇంటర్ మొదటి సంవత్సరానికి...

బ్రహ్మంగారిమఠం, జూన్ 28 : బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులపాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యాసంవత్సరానికి స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపల్ పద్మనాభమూర్తి ప్రకటనలో తెలిపారు. జూలై 1న విద్యార్థులు పదో తరగతి ఒరిజనల్ సర్టిఫికెట్, టీసీ, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు తీసుకుని నేరుగా కళాశాల యందు హాజరు కావాలన్నారు. మార్కులిస్టు మెరిట్ ప్రకారం జాయిన్ చేసుకుంటామని తెలిపారు.

ఐటీఐలో రెండో స్పెల్ కు...

ఎర్రగుంట్ల, జూన్ 28: ఎర్రగుంట్లలోని ఐటీఐలో ప్రవేశానికి రెండోస్పెల్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే.ఆనంద్ తెలిపారు. ఒకటో స్పెల్ అడ్మిషన్లు పూర్తికాగా మిగిలిన సీట్లు భర్తీ చేసేందుకు ఈ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ఐటీఐలో ఉచితంగా దరఖాస్తులు చేసుకోవచ్చునని ఇతర వివరాలకు ఐటీఐలో సంప్రదించాలన్నారు.

అట్లూరు పశువైద్యశాల తనిఖీ

అట్లూరు, జూన్ 28 : అట్లూరు పశువైద్యశాలను శుక్రవారం ఏరియా డిప్యూటీ డైరెక్టరు లక్ష్మీదేవి తనిఖీ చేశారు. హాజరు పట్టికను పరిశీలించగా వైద్యాధికారి శిరీష విధులకు హాజరు కాలేదు. సెలవు పెట్టలేదని ఆమె తెలిపారు. ఎందుకు హాజరు కాలేదని వివరణ తీసుకుని చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. కుంభగిరి, తంబళ్లగొంది సచివాలయం, అనిమల్ అసిస్టెంట్లకు పశువుల వైద్యం పట్ల శిక్షణ ఇస్తామన్నారు. గ్రామాల్లో పశువులకు సీజనల్ వ్యాధులకు టీకాలు వేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, సునంద ఉన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

ప్రొద్దుటూరు , జూన్ 28 : ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ సభా భవనంలో జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి ఓప్రకటనలో తెలిపారు. 7 అంశాల అజెండాపై ఈ సమావేశంలో చర్చించి తీర్మాణం చేయనున్నట్లు తెలిపారు.

నేడు కౌన్సిల్ సమావేశం

ఎర్రగుంట్ల, జూన్ 28: ఎర్రగుంట్లనగరపంచాయతీ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రామక్రిష్ణయ్య తెలిపారు. ప్రభుత్వం మారిన తర్వాత మొదటి సమావేశం కావడంతో ఈ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణ రెడ్డి ఈసమావేశానికి హాజరవుతున్నారు.

పింఛన్ల పంపిణీలో అప్రమత్తంగా వ్యవహరించండి



పింఛన్ల పంపిణీపై నిర్వహించిన ప్రత్యేక సమాశంలో మాట్లాడుతున్న కాశినాయన, గోపవరం మండల అధికారులు

కాశినాయన,జూన్ 28: పింఛన్‌ల పంపిణీలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని తహసీల్దారు కృష్ణ, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి,ఎస్‌ఐ అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపురం తహసీల్దారు కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 1వ తేదీన ఉదయం 6గం నుంచే పింఛన్‌ల పంపిణీ ప్రారంభం కావాలని గతంకంటే పింఛన్ డబ్బులు రెట్టింపు వస్తున్నందున పంపిణీ సమయంలో ఎలాంటి పొరపాట్లు, ఇబ్బందులు తలెత్తకుండా భద్రతాపరంగా తగుజాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.ఈసమావేశంలో పలువురు పంచాయతీ సెక్రటరీలు సిబ్బంది పాల్గొన్నారు.

గోపవరం..:మండల కార్యాలయంలో మండల, గ్రామస్థాయి అధికారులతో 1వతేదీన పెంచిన పింఛన్లు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌పంపిణీ చేసే నిమిత్తం అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా 2684 మంది పింఛనర్లకు ఒక కోటీ 77 లక్షలా 33వేల 900 పంపిణీ చేపట్టడానికి అన్ని రకాలు చర్యలు తీసుకున్నారు. మొత్తం 47 మంది సిబ్బంది 1వతేదీ ఉదయం 5గంటలకు గ్రామాలకు వెళ్లి తగు ఏర్పాట్లు చేసుకుని పంపిణీ ప్రారంభించి వంద శాతం అదే రోజు పూర్తి చేయాలన్నారు. ఏమైనా మిగిలితే మరుసటి రోజు ఉదయం 10గంటల్లోపు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అవసరమైతే డబ్బు రక్షణ కోసం పోలీసు వారి సహకారం తీసుకోవాలని పెన్షన్ పంపిణీ చేసే సిబ్బంది 30తేదీ రాత్రి గ్రామాల్లో నిద్రించాలి. తగు ఏర్పాట్లు సంబంధిత పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షించాలన్నారు. పెన్షన్ పంపిణీ పండుగ వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లుచేయాలని ఎంపీడీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండాపురం..: జూలై 1న సచివాలయ సిబ్బంది ఉదయం 5 గంటల నుంచే ఇంటింటికి సామాజిక పెన్షన్లను పంపిణీ చేస్తారని ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. మండలంలో పెన్షన్ల పంపిణీకి ఇతర సిబ్బంది అవసరం లేకుండానే సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తారన్నారు. ఆయా గ్రామాల పరిధిలోని పెన్షన్‌దారులకు ఆగ్రామంలోనే ఇంటికి వెళ్లి పంపిణీ చేస్తారని, లబ్దిదారుడు మరో గ్రామంలో ఉంటే వారి వద్దకు వెళ్లి పంపిణీ చేయరని తెలిపారు.

ప్రొద్దుటూరు..: జులై 1 నుంచి పెంచిన 4 వేల పింఛన్‌తో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలది వెయ్యి రూపాయలు కలిపి మొత్తం 7 వేలు పింఛన్‌ను పంపిణీ పటిష్టంగా చేయాలని కమిషనర్ రఘునాథరెడ్డి, డీఎస్పీ మురళీధర్ తెలిపారు. శుక్రవారంమున్సిపల్ సభా భవనంలో సచివాలయాల సిబ్బందితో పింఛన్ల పంపిణీ పై పోలీసు అధికారులు సూచనలు ఇచ్చారు. సమావేశంలో రూరల్ సీఐ రమణారెడ్డి పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కరుణాకర్‌కు బెదిరింపులు

ప్రొద్దుటూరు, జూన్ 28 : గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు తనను చంపుతామని బెదిరించినట్లు ప్రొద్దుటూరు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నాయకుడుగా పని చేస్తున్న తనగాని కరుణాకర్ యాదవ్ పేర్కొన్నారు. ఆయన వివరాల మేరకు.. గురువారం రాత్రి 7 గంటల సమయంలో సరస్వతి విద్యామందిర్‌రోడ్డులో ఆయన భార్య పద్మ నిర్వహిస్తున్న టైలర్ షాపు వద్దకు వెళ్ళి నీభర్తను చంపుతామని కత్తులతో బెదిరింపులకు పాల్పడ్డారని కరుణాకర్ తెలిపారు. ఆమేరకు త్రీటౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశామని తెలిపారు. కానీ ఇంతవరకు పోలీసులు కనీసం విచారించి కేసు నమోదు చేయలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ టైలర్ షాపు వద్ద నున్న సీసీ కెమెరాల ద్వారా ఆ వ్యక్తులను గుర్తించవచ్చన్నారు. కానీ పోలీసులు ఇంత వరకు ఏ చర్యలూ తీసుకోకపోవడంపై ఆయన ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

నలుగురు పోలీసు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు

కడప (క్రైం), జూన్ 28: జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న నలుగురు సిబ్బందిని శుక్రవారం ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణాలో వారి ప్రమేయం ఉన్నట్లు విచారణలో తేలడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. బద్వేలు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సుధాకర్, అట్లూరు పీఎస్‌లో కానిస్టేబుల్ రామకృష్ణ, ప్రొద్దుటూరు 3 టౌన్ హెడ్‌కానిస్టేబుల్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

ఆర్మీ మాజీ ఉద్యోగిని సన్మానించిన అనంతపురం కలెక్టర్



కొండాపురం, జూన్ 28: కొండాపురం పట్టణానికి చెందిన ఆర్మీ మాజీ ఉద్యోగి పీర్ల హాజీవలిని అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ శుక్ర వారం సన్మానించారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, రక్తదాన శిబిరాలు నిర్వహించడం వంటి తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు బెస్ట్ గుడ్‌నెస్ డ్యూటీ అవార్డుతో అనంతపురం కలెక్టరేట్‌లో సన్మానించినట్లు హాజీవలి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

గంజాయి విక్రయంపై ఉక్కుపాదం మోపాలి

బద్వేలు, జూన్ 28: గంజాయి విక్రయదారులపై ఉక్కుపాదం మోపాలని సీపీఎం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు చాంద్‌బాష పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహిం చిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి విక్రయం అధికమైందని వాపోయారు. పలువురు విద్యార్థులు ఈ మత్తుకు అలవాటుపడి తమ జీవితాన్ని నాశనం చేసుకుంటు న్నారన్నారు. పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలని అలాగే దోషులను పట్టుకుని వారు ఎంతటి వారైనా సరే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సీపీఎం నాయకులు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి నిధులు కేటాయించండి

పోరుమామిళ్ల, జూన్ 28 : మేజరు పంచాయతీ అభివృద్ధికి 14, 15వ ఫైనాన్స్ నిధులు అందేలా చేసి అభివృద్ధికి సహకరించాలని పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ కమిషనరేట్ అధికారి రమణారెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయనజిల్లా పరిషత్ హైస్కూలులో జరుగుతున్నఆర్థిక సంఘం సమావేశానికి హాజరయ్యారు. 20 ఏళ్లుగా పోరుమామిళ్ల పంచాయతీలో కాంట్రాక్టు బేస్‌గా కార్మికులు పనిచేస్తున్నారని వారిని రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

జమ్మలమడుగు, జూన్ 28: జమ్మలమడుగులో ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మార్పీఎస్ నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని ఆయా మండలాల నాయకులు, అధ్యక్షులు పాల్గొన్నారు. అనంతరం దళితుల సంక్షేమంపై పలు అంశాలు చర్చించారు. మాని నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఎమ్మార్పీఎస్ జమ్మలమడుగు మండల అధ్యక్షుడిగా సున్నపురాళ్లపల్లె వెంకటేష్, పెద్దముడియం వి.శ్రీకాంత్, మైలవరం మునిస్వామి, జమ్మలమడుగు పట్టణ అధ్యక్షుడుగా వెంకటసుబ్బయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

సుంకేసుల కాలువను పరిశీలించిన అధికారులు

ఖాజీపేట, జూన్ 28: ఖాజీపేట సుంకేసుల కాలువను ఎంఐఏఈ వేణుగోపాల్, కేసీ కెనాల్ ఏఈ సుబ్బరాయుడు శుక్రవారం పరిశీలించారు. సాయంత్రం వారు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా సుంకేసుల పంట పొలాలకు నీరు అందకపోవడంతో కాలువలో పూడిక పూర్తిగా పేరుకుపోయిందని, పూడికను తొలగించి సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఎంపీటీసీ చంద్రభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో సుంకేసుల గ్రామ ప్రజలు తెలుగుదేశం పార్టీలో చేరి మా పంట పొలాలకు నీరు అందించాలనడంతో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ స్పందించి ఇరిగేషన్ అధికారులకు ఆదేశించడంతో ఆమేరకు వారు పరిశీలించారన్నారు.

'సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం'

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 28: పట్టణంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో విస్తృతంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని రోటరీ క్లబ్ నూతన గవర్నర్ డాక్టర్ సీపీ సాధుగోపాలక్రిష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. 30వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు రెడ్ల కల్యాణ మండపంలో రోటరీ క్లబ్ గవర్నర్‌గా ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులుపాల్గొన్నారు.

గుంతల రోడ్లకు మరమ్మతులు చేయండి

జమ్మలమడుగు, జూన్ 28: జమ్మలమడుగు పట్టణంలోని నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా పశువుల ఆస్పత్రి వద్ద ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టాలని జమ్మలమడుగు మున్సిపాలిటీ కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్ డీఈ బాలమల్లేష్‌కు డీవైఎఫ్ఐ కమిటీ వినతి పత్రం అందజేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ పట్టణంలోని రామిరెడ్డిపల్లె సర్కిల్, ఎత్తపువారి కాలనీ, ముద్దనూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్లు గుంతలు దర్శనమిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో క్రిష్టారెడ్డి, సూరి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలను సందర్శించిన విద్యార్థులు

మైదుకూరు, జూన్ 28 : పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు శుక్రవారం స్థానిక పరిశ్రమలవాడలో ఉన్న పలు పరిశ్రమలను సందర్శించారు. ప్రిన్స్‌పాల్ గురుమూర్తి ఆధ్వర్యంలో కళాశాలలో ఉన్న సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్ తదితర విభాగాల విద్యార్థులు యంత్రాలు, వాటి పనితీరును ప్రత్యక్షంగా చూశారు.

మార్కెట్ నిర్మాణ పనులపై చర్చించిన ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు , జూన్ 28 : ప్రొద్దుటూరు పట్టణం శివాలయం సర్కిల్లో నిర్మిస్తున్న మున్సిపల్ కూర గాయల మార్కెట్ నిర్మాణం పనులపై కేసీపీ సంస్థ చైర్మెన్ అనిల్ కుమార్‌తో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి చర్చించారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని అనిల్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు.ఈ సందర్బంగా కూరగాయల మార్కెట్ నిర్మాణం ఏ దశలో వుంది. ఎప్పటికి పూర్తి అవుతుం దని చర్చించారు. పనుల నాణ్యతపై ఆరా తీశారు.

సన్‌షైన్ ఆస్పత్రి ప్రారంభం



సన్‌షైన్ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న శాంతిరాముడు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 28: స్థానిక గాంధీరోడ్డులోని మౌలానా ఆజాద్ వీధి-2లో నూతనంగా ఏర్పాటు చేసిన సన్‌షైన్ ఆస్పత్రిని శుక్రవారం నంద్యాల శాంతిరామ్ మెడికల్ కళాశాల చైర్మన్ డాక్టర్ ఎం.శాంతిరాముడు ప్రారంభించారు. పురుషుల డాక్టర్ రూమును ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మహిళల డాక్టర్ రూమును మాజీ ఎమ్మెల్సీ చదిపిరాళ్ల నారాయణరెడ్డి, ఆపరేషన్ రూమును డాక్టర్ వి.సంధ్యాకుమారి, డాక్టర్ సి.సత్యప్రసాద్, వార్డును డాక్టర్ జీవీజీ మహేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ నజ్మాబిజాన్, డాక్టర్ మహమ్మద్ ఇర్షాన్ మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో బీపీ, షుగర్, థైరాయిడ్, నరాల బలహీనత, ఆస్తమా, గ్యాస్ట్రబుల్ వంటి జబ్బులకు వైద్యం అందిస్తామన్నారు. అలాగే బాలింతల సమస్యలు, సంతాన సాఫల్య సేవలు, క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు, సిజేరియన్ ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కె.అబ్దుల్ ఖలీల్, విశ్రాంత జిల్లా జడ్జి ఎస్ఎం.ఇస్మాయిల్, విశ్రాంత బ్యాంకు మేనేజర్ ఎస్.ఖాజామైనుద్దీన్, ఎస్.అహ్మద్‌హుస్సేన్, కుటుంబ సభ్యులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్రగా బయల్దేరిన టీడీపీ నేతలు

బ్రహ్మంగారిమఠం, జూన్ 28 : మైదుకూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా పుట్టా సుధాకర్‌యాదవ్ సార్వత్రిక ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలుపొందిన సందర్భం గా ఎన్నికల ముందు వేంకటేశ్వరుడికి మొక్కుకున్నామని, ఈ రోజు మొక్కు తీర్చుకునేందు కు పాదయాత్రగా బయలు దేరుతున్నామని నేతలు తెలిపారు. మండలంలోని శ్రీవీరబ్రహ్మేంద్రనగర్‌కు చెందిన ఈశ్వరయ్య, పాలేపాడు, ఆశ్రమం వీరయ్య, పల్లావీరన్న, దేవరకొండ నరేంద్ర, దాసరి మధుసూదన్‌రావు, సుబ్బయ్య శుక్రవారం వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్న అనంతరం పాదయాత్రకు బయల్దేరారు. ఈ పాదయాత్రను మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ఎస్ఆర్ శ్రీనివాసులరెడ్డి, వెల్లటూరు సాంబశివారెడ్డి తదితరులు ప్రారంభించారు. టీడీపీ నేతలు మేకల సుధాకర్, సుబ్రమణ్యం, వెంగల్‌రెడ్డి, సురేంద్రయాదవ్, నరసింహ, ప్రముఖ న్యాయవాది పట్టాభిరాం, రఘు, పురుషోత్తంరెడ్డి, గగ్గర సుబ్బయ్య, రమణ, మస్తాన్‌యాదవ్, చిలమల నాగయ్య, జయరాంనాయుడు, ఈశ్వర్‌రెడ్డి, ఆకుల శివ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'పుట్టా' కు అడుగడుగునా నీరాజనాలు



మైదుకూరులో భారీ జన సందోహం మధ్య ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, పెద్ద ఎత్తున బాణసంచా పేలుస్తున్న టీడీపీ కార్యకర్తలు

మైదుకూరు, జూన్ 28 : ఓ వైపు వర్షపు జల్లులు మరో వైపు అభిమానులు దారి పొడవునా పూల జల్లులు.. బాణా సంచాలు పేలుస్తూ అడుగడుగునా నీరాజనాలు.. ఏకధాటిగా దాదాపు 7 గంటల పాటు కోలాహలంగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. 13 ఏళ్ళపాటు ఆయన కల కన్నట్లుగానే ఆయన శాసనసభలో ప్రమాణ స్వీకారం చేపట్టిన అనంతరం ఆయన శుక్రవారం మైదుకూరు నియోజకవర్గంలో అడుగు పెట్టగానే కార్యకర్తలు, అభిమానులు, నాయకులు భారీ ఎత్తున స్వాగతం పలికారు. దువ్వూరు మండలంలోని గుడిపాడు, చింతకుంట, మైదుకూరు, విశ్వనాథపురం, చాపాడు,నాగులపల్లె మీదుగా ప్రొద్దుటూరులోని ఆయన నివాసానికి చేరుకున్నారు. మైదుకూరు పట్టణంలోని రాయల్ సర్కిల్‌లో దాదాపు గంట పాటు బాణా సంచా పేల్చుతూ పూలజల్లుల కురిపించారు. రాయల్ సర్కిల్ ఆయన ఎక్స్‌కవేటర్ సహాయంతో పైకి ఎక్కి శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పాలాభిషేకం చేపట్టి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కాగా టీడీపీ నాయకులు ప్రధాన రహదారులపై ఆయన పూలమాల వేసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, నాయకులు ధనపాల జగన్, ఆకుల క్రిష్ణయ్య, మేకల బాబు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

చాపాడు..: మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు ప్రజలు, టీడీపీ కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. ఆయన తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో శుక్రవారం రాత్రి ఊరేగింపు జరిపారు. దారి జాతీయ రహదారి పొడవునా అభిమానులు బాణసంచా పేల్చి డప్పులతో డ్యాన్స్ చేస్తూ ఘనస్వాగతం పలికారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అభిమానంతో ఆయనకు గజమాల, పూలదండలతో సన్మానించారు. విశ్వనాథపురం, బద్రిపల్లె, కేతవరం, లక్ష్మీపేట, సీతారామపురం, చియ్యపాడు, చాపాడు, పల్లవోలు, ఖాదర్‌పల్లె, నాగులపల్లె గ్రామాలమీదుగా జాతీయ రహదారిపై భారీగా ప్రజలు స్వాగతం పలికారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు హేమారెడ్డి, గోసుల క్రిష్టారెడ్డి, అక్బర్, సలీం, నరసింహారెడ్డి, సుదర్శన్, మేకల బాబు, వీరనారాయణ, కిరణ్‌కుమార్‌రెడ్డి, కార్తిక్‌రెడ్డి, గురివిరెడ్డి, నాయబ్‌రసూల్, రామాంజనేయులు, ప్రభాకర్‌రెడ్డి, రామమోహన్, గోర్ల సుబ్బరాయుడు, పసల రమణ, నాగరాజు, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ఖాజీపేట..: మైదుకూరు ఎమ్మెల్యే ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా మైదుకూరుకు వస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్‌కు ఘన స్వాగతం పలికేందుకు దువ్వూరు దగ్గరకు ఖాజీపేట నాయకులు, కార్యకర్తలు మండల టీడీపీ అధ్యక్షులు లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యం తగదు

ప్రొద్దుటూరు , జూన్ 28 : సీజనల్ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం తగదని మండల వైద్యఅధికారి డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ సభా భవనంలో సచివాలయ సిబ్బందితో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి , హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆస్పత్రి హోమియోవైద్యురాలు డాక్టర్ అపర్ణ పేర్కొన్నారు. శుక్రవారం హోమస్‌పేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఆయూష్ విభాగంలో సీజనల్ వ్యాధులపట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలుషిత ఆహారం, మురికినీరు, దోమల వల్ల సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయని తెలిపారు. దగ్గు, జలుబు, జ్వరం, గొంతు నొప్పి, వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, శ్వాసకోశ సమస్యలు, వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. పిల్లలతోపాటు అన్ని వయస్సులవారు సీజనల్ వ్యాధుల బారీన పడుతారని తెలిపారు. ఈ వ్యాధులు రాకుండా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాధి నిరోధకశక్తిని పెంచడానికి హోమియో మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో యునాని వైద్యురాలు నిషాన్‌జాన్ నాయక్, పాఠశాల హెచ్ఎం రవీంద్రుడు, ఉపాధ్యాయులు, ఆయూష్ సిబ్బంది మహేశ్వరయ్య, రాజారెడ్డి, రత్న పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న డాక్టర్ అపర్ణ

కాశినాయన..: గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు పేర్కొన్నారు.శుక్రవారం ఆయన వడ్డమాను గ్రామాన్ని ఆకస్మికంగా తనికీచేశారు. స్థానిక సర్పంచ్ జయరావు,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సందీప్,ఇంజనీరింగ్ అస్టిసెంట్ మల్లికార్జున,వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి గ్రామంలోని మంచినీటి బోర్లను పైపులైన్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పైప్‌లైన్లు లీకేజీ కాకుండా,నీరు నిలిచివుండకుండా చూడాలన్నారు.గ్రామాల్లో కలుషితమైన నీరు తాగడం మూలంగా ప్రజలు డయేరియా బారినపడే ప్రమాదంఉందని క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో నిర్మల, ఆరోగ్యపర్యవేక్షకుడు బాలయ్య ఇతర వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: పిల్లలకు కీటక జనిత వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి అన్నారు, శుక్రవారం ఆయన స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహం కస్తూర్బా గాంధి బాలికల రెసిడెన్షియల్ కళాశాల వసతిగృహాన్ని పరిశీలించారు. వైద్యులు శ్రీవిద్య, సీహెచ్‌వో నిర్మల, హెల్త్ సూపర్‌వైజర్లు ,కేజీబీవీ కళాశాలప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.